మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శనివారం SATURDAY 21-3-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 261 Issue: 261

21 మార్చి 2026 - శనివారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - వసంత ఋతువు చైత్ర మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:23 సూర్యాస్తమయం - సా. 6:23 తిథి తదియ రా. 11:56 వరకు తరువాత చవితి సంస్కృత వారం స్థిర వాసరః నక్షత్రం అశ్విని రా. 12:37ం వరకు తరువాత భరణి యోగం ఇంద్ర సా. 6:52 వరకు కరణం తైతుల మ. 1:14 వరకు గరజి రా. 11:56 వరకు వర్జ్యం రా. 8:55 నుండి రా. 10:24 వరకు దుర్ముహూర్తం ఉ. 7:59 నుండి ఉ. 8:47 వరకు రాహుకాలం ఉ. 9:23 నుండి ఉ. 10:53 వరకు యమగండం మ. 1:53 నుండి మ. 3:23 వరకు గుళికాకాలం ఉ. 6:23 నుండి ఉ. 7:53 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:47 నుండి తె. 5:35 వరకు అమృత ఘడియలు సా. 5:57 నుండి రా. 7:26 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:59 నుండి మ. 12:47 వరకు

Published from Jagitial
Circulated to Telangana





# బడ్జెట్ బీమా

## పేదలకు రూ.5 లక్షల జీవిత బీమా

### 1.15 కోట్ల కుటుంబాలకు లబ్ధి.. విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్ పథకం

### ఉద్యోగులకు నగదు రహిత వైద్యం.. రూ.1.20 కోట్లతో ప్రమాద భీమా

: తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం వరుసగా నాలుగోసారి బడ్జెట్‌ను సమర్పించింది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను మొత్తం రూ.3,24,234 కోట్లతో బడ్జెట్‌ను ప్రతిపాదించారు. ఈ బడ్జెట్‌లో పల్లెల అభివృద్ధి, విద్య, వ్యవసాయం, నీటిపారుదల రంగాలకు అగ్ర ప్రాధాన్యం దక్కింది.

హైదరాబాద్, మార్చి 20 (ఈవార్తలు) రాష్ట్రంలోని 1.15 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షల బీమా కల్పించే 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా', విద్యార్థులకు 'బ్రేక్ ఫాస్ట్ పథకం', ఉద్యోగులకు నగదు రహిత ఆరోగ్య భద్రత విప్లవాత్మక పథకాలను ప్రభుత్వం ప్రకటించింది. ప్రజల ప్రయోజనాలు, -2 వ పేజీలో...

### బడ్జెట్ స్వరూపం:

మొత్తం బడ్జెట్ అంచనా: రూ. 3,24,234 కోట్లు.
రెవెన్యూ వ్యయం: రూ. 2,34,406 కోట్లు.
మూలధన వ్యయం: రూ. 47,267 కోట్లు

**వివిధ శాఖలకు నిధుల కేటాయింపు (రూ.)**

పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి: 33,688 కోట్లు.
విద్యా రంగం: రూ. 26,674 కోట్లు.
వ్యవసాయం, రైతు సంక్షేమం: రూ. 23,179 కోట్లు.
నీటి పారుదల శాఖ: రూ. 22,615 కోట్లు.
విద్యుత్ శాఖ: రూ. 21,285 కోట్లు.
పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ: 17,907 కోట్లు.
వైద్య, ఆరోగ్య శాఖ: రూ. 13,679 కోట్లు.
రోడ్లు, భవనాలు, రవాణా శాఖ: రూ. 12,789 కోట్లు.
బీసీ (బీజ) సంక్షేమం: రూ. 12,511 కోట్లు.
హోం శాఖ (పోలీస్): రూ. 11,907 కోట్లు.
ఎస్సీ (ాజ) సంక్షేమం: రూ. 11,784 కోట్లు.
ఎస్టీ (ాు) సంక్షేమం: రూ. 7,937 కోట్లు.
గృహ నిర్మాణ శాఖ, ఇందిరమ్మ ఇండ్లు: 7,430 కోట్లు.
పౌర సరఫరాల శాఖ: రూ. 7,366 కోట్లు.
మైనారిటీ సంక్షేమం: రూ. 3,769 కోట్లు.
పరిశ్రమల శాఖ: రూ. 3,490 కోట్లు.
మహిళ, శిశు సంక్షేమం: రూ. 3,143 కోట్లు.
న్యాయ శాఖ: రూ. 2,367 కోట్లు.
పశు సంవర్ధక, మత్స్య శాఖ: రూ. 1,529 కోట్లు.
పర్యాటక రంగం: రూ. 1,224 కోట్లు.
కార్మిక సంక్షేమ శాఖ: రూ. 998 కోట్లు.
ఐటీ (Xు) శాఖ: రూ. 875 కోట్లు.
చేనేత రంగం: రూ. 258 కోట్లు.


### గత నాలుగేళ్లలో అప్పులు పెరిగాయిలా..

2023-24 (వాస్తవ లెక్కలు):
మొత్తం అప్పులు రూ.3,98,655 కోట్లు (జీఎస్డీపీలో 27%).

2024-25 (వాస్తవ లెక్కలు):
మొత్తం అప్పులు రూ.4,47,493 కోట్లు (జీఎస్డీపీలో 28%).

2025-26 (సవరించిన అంచనాలు):
మొత్తం అప్పులు రూ.5,03,905 కోట్లు (జీఎస్డీపీలో 28%).

2026-27 (బడ్జెట్ అంచనాలు):
మొత్తం అప్పులు రూ.5,62,363 కోట్లు (జీఎస్డీపీలో 29%)



# అప్పుల కుప్ప

## తెలంగాణపై రూ.5,62,363 కోట్ల అప్పు

### వచ్చే ఏడాది రూ.60,000 కోట్ల సేకరణ.. జీఎస్డీపీలో 29 శాతం.. గతంతో పోల్చితే అధికం

రాష్ట్ర శాసనసభలో ప్రవేశపెట్టిన 2026-27 వార్షిక బడ్జెట్‌లో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, అప్పుల లెక్కలపై ప్రభుత్వం స్పష్టమైన గణాంకాలను అందించింది. బడ్జెట్ పత్రాల్లోని పబ్లిక్ డెబ్ట్ ఔట్ స్టాండింగ్ (ఎఫ్ఆర్‌బీఎం రుణాలు) నివేదిక ప్రకారం, రాష్ట్ర అప్పుల భారం ఏటేటా పెరుగుతూనే ఉంది. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలు నేపథ్యంలో ప్రభుత్వం పెద్ద ఎత్తున బహిరంగ మార్కెట్ రుణాలపై ఆధారపడుతోంది.

హైదరాబాద్, మార్చి 20 (ఈవార్తలు): 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను రాష్ట్ర మొత్తం అప్పులు రూ.5,62,363 కోట్లకు చేరుకుంటాయని బడ్జెట్ అంచనాలు స్పష్టం చేస్తున్నాయి. అంటే, వచ్చే ఏడాదిలో ప్రభుత్వం సుమారు రూ. 60,000 కోట్ల మేర అప్పు తీసుకోవాలని నిర్ణయించింది. దీనివల్ల ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి రూ.5.03 లక్షల కోట్లుగా ఉన్న మొత్తం అప్పు, వచ్చే ఏడాది చివరి నాటికి రూ. 5.62 లక్షల కోట్లకు చేరుకోనుంది. ఇది రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తిలో 29 శాతానికి చేరనుంది. గత తరువాయి 2 వ పేజీలో...

# టెన్త్ పరీక్షలు రద్దు!

### 12వ తరగతి వరకు ఒకే విధానం.. విద్యావిధానంలో మార్పులు చేస్తాం

### మూసీ ప్రక్షాళన ఆగే ప్రసక్తే ఉండదు.. పార్టీ చేతిలో జీవన్ రెడ్డి వ్యవహారం

### మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్





### బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,891 |
| వెండి (గ్రాము): | రూ.260 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,022 |

### విశ్వవాణి



ప్రపంచంలో అత్యంత ఆనందకరమైన దేశంగా ఫిన్లాండ్ మరోసారి టాప్ ప్లేస్‌లో నిలిచింది. సామాజిక మద్దతు, స్వేచ్ఛ తదితర అంశాల్లో వరుసగా తొమ్మిదోసారి ఈ దేశం నం.1గా నిలిచింది. ఆ తర్వాత ఐస్‌లాండ్, డెన్మార్క్ వరుసగా రెండు, మూడు స్థానాలు సాధించాయి.

# భట్టి బడ్జెట్.. వట్టి బడ్జెట్




## సకల జనులకు దక్కేది సున్నా

### బడ్జెట్ లెక్కలన్నీ బోగస్.. మాజీమంత్రి హరీశ్ రావు

2026-27 బడ్జెట్ బోగస్ బడ్జెట్, బడా జూటా బడ్జెట్ అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ టీ హరీశ్ రావు విమర్శించారు. ఇది అభయ హస్తం కాదు.. రిక్త హస్తం అని అర్థమైందని ఎద్దేవా చేశారు. తెలంగాణను, హైదరాబాద్ ను మూడు ముక్కలు చేయడం తప్ప విజన్ లేదు..విషయం లేదు అని, పింఛన్ల పెంపు లేదు.. రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ గురించి ఊసు లేదని విమర్శించారు.

హైదరాబాద్, మార్చి 20 (ఈవార్తలు): ఓట్లేసిన ప్రజలను వెన్నుపోటు పొడిచారు.. అన్ని వర్గాల ప్రజలకు మొండి చెయ్యి చూపించారు అని దుయ్యబట్టారు. ఆర్టీసీ కార్మికులకు మొండి చేయి, సింగరేణి కార్మికులకు మొండి చేయి చూపారని, ముదిరాజులకు, గౌడన్నలకు, గొల్ల కుర్మలకు ఇలా అన్ని బీసీ వర్గాలకు మొండి చేయి చూపారని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీలకు, మైనార్టీలకు, మహిళలకు, ఆశా, అంగన్ వాడీలకు మొండి చేయ చూపారన్నారు. మొత్తానికి ఈ బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలను నిరాశపరిచిన బడ్జెట్, దగాకోరు తరువాయి 2 వ పేజీలో...



# నాటో పిరికిపంద

### అది ఓ కాగితం పులి.. విరుచుకుపడ్డ ట్రంప్

ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ జరుపుతున్న యుద్ధంలో తమకు సహకరించడం లేదంటూ నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్ (నాటో)పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విమర్శలు గుప్పించారు. అమెరికా లేకపోతే నాటో ఒక 'కాగితం పులి' అని సంచలన వ్యాఖ్యలు చేశారు. నాటో భాగస్వాములను 'పిరికివాళ్లు'గా సంబోధించారు. ట్రూత్ సోషల్ పోస్టులో ట్రంప్ నాటో భాగస్వాములపై ఈ విమర్శల దాడి చేశారు.

వాషింగ్టన్:'మధ్యప్రాచ్యంలో ఇరాన్ ఉగ్రవాద పాలనకు వ్యతిరేకంగా మేము చేపట్టిన సైనిక చర్యలో పాలుపంచుకోవడం తమకు ఇష్టం లేదని మెజారిటీ నాటో (నాటో) మిత్ర దేశాలు చెప్పాయి. వాస్తవానికి మేము చేస్తున్న పనిని దాదాపు ప్రతి దేశం గట్టిగా అంగీకరించింది, ఇరాన్ ఏ రూపంలోనూ అణ్వాయుధాన్ని కలిగి ఉండకూడదని అవి భావిస్తున్నాయి. అయినప్పటికీ అవి వెనకడుగు వేశాయి. వారి చర్య నాకు ఆశ్చర్యం కలిగించలేదు. ఎందుకంటే నాటో అనేది ఒక 'వన్ వే స్ట్రీట్' (ఏకపక్ష ప్రయోజనం) అని నేను ఎప్పుడూ భావిస్తుంటాను. ఈ దేశాల రక్షణ కోసం మేం ఏటా వందల బిలియన్ల డాలర్లు ఖర్చు చేస్తున్నాం. మేము వారిని రక్షిస్తాం, కానీ అవసరమైన సమయంలో వారు మా కోసం ఏమీ చేయరు. మేం ఇరాన్ సైన్యాన్ని నాశనం చేశాం. వారి నౌకాదళం అంతమైంది. వైమానిక దళం పోయింది, వారి యాంటీ-ఎయిర్‌క్రాఫ్ట్, రాడార్ వ్యవస్థలు తరువాయి 2 వ పేజీలో...

# షర్మిలకు జగన్ అన్యాయం

### మేనకోడలు, మేనల్లుడికీ అన్యాయం

### వైఎస్ చనిపోయేవరకు ఉమ్మడి ఆస్తులే

### దేవుడి సాక్షిగా నేను చెప్పేవి నిజాలే

### వైఎస్ విజయమ్మ సంచలన నోటరీ



పులివెందుల, మార్చి 20 (ఈవార్తలు): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, ఆయన సోదరి, ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మధ్య ఆస్తుల వివాదంపై వారి తల్లి వైఎస్ విజయమ్మ స్పందించారు. కుటుంబ ఆస్తుల పంపకాలపై పూర్తి స్పష్టతనిస్తూ ఆమె ఓ అడ్వొకేట్ నోటరీ విడుదల తరువాయి 2 వ పేజీలో...




# ఐస్ క్రీం అమ్మితే 5 వేల జరిమానా!

ఐస్ క్రీం బండ్లను తమ ఊరిలోకి రానిచ్చే ప్రసక్తే లేదని, వస్తే జరిమానా తప్పదని హెచ్చరిస్తున్నారు మహబూబాబాద్ జిల్లా గూడురు గ్రామవాసులు. వేసవిలో ఐస్‌క్రీంలతో డబ్బులు సంపాదించు కుందామనుకుంటే అసలుకే మోసం వస్తుందని, చిన్నారులను అనారోగ్యానికి గురిచేసే తినుబండారాలను ప్రోత్సహించేది లేదని తేల్చి చెప్పారు. ఈ మేరకు గ్రామ శివార్లలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. తమ షరతుకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

- మహబూబాబాద్, మార్చి 20 (ఈవార్తలు)

# తమిళనాడులో 8 మంది దుర్మరణం

### సేలం జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

సేలం: తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అదుపుతప్పి వేగంగా వచ్చిన ప్రభుత్వ బస్సు.. ఒక టెంపోను, బైకును ఢీకొంది. ఈ ఘటనలో 8 మంది మరణించారు. ఈ ప్రమాదం తమిళనాడులోని అరియనూర్ సమీపంలో, ఉత్తమ సోలాపురం వద్ద, సేలం జాతీయ రహదారిపై శుక్రవారం జరిగింది. తమిళనాడు స్టేట్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (టీఎన్ఎస్‌టీసీ)కి చెందిన బస్సు 40 మంది ప్రయాణికులతో కోయంబత్తూర్ నుంచి తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు

21.3.2026

మేషం: నిరుద్యోగులకు అప్రయత్న కార్యసిద్ధి కలుగుతుంది. సోదరులతో దీర్ఘకాలికంగా వివాదాలు పరిష్కారమవుతాయి. ఉద్యోగస్తులకు శుభవార్తలు అందుతాయి. ఆస్తి వివాదాలలో నూతన ఒప్పందాలు చేసుకుంటారు. వృత్తి ఉద్యోగాలలో కీలక నిర్ణయాలు అమలు చేస్తారు. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి.

వృషభం: చేపట్టిన పనులలో ఆటంకాలు ఉన్నప్పటికీ సకాలంలో పూర్తవుతాయి. మిత్రుల నుండి ఆసక్తికర విషయాలు తెలుస్తాయి. మొండి బకాయిలు వసూలవుతాయి. సమాజంలో మీ మాటకు విలువ పెరుగుతుంది. వ్యాపార ఉద్యోగాలు మరింత ఉత్సాహంగా సాగుతాయి. ప్రయాణాలు అనుకూలిస్తాయి.

మిధునం: దూర ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. వృత్తి ఉద్యోగాలలో అదనపు పని భారం వలన విశ్రాంతి లభించదు. ఇంటాబయట ఒత్తిడులు పెరుగుతాయి. వ్యాపారాలు ఆశించిన రీతిలో రాణించవు. నిరుద్యోగులకు నిరాశ తప్పదు. విద్యార్థులు పోటీ పరీక్షల్లో మిశ్రమ ఫలితాలు అందుతాయి.

కర్కాటకం: వ్యాపార వ్యవహారాలు నత్తనడకన సాగుతాయి. కీలక వ్యవహారాలలో ఆప్తులతో మాటపట్టింపులు ఉంటాయి. చేపట్టిన పనులులో శ్రమాధిక్యత పెరుగుతుంది నిరుద్యోగుల ప్రయత్న లోపం వలన వచ్చిన అవకాశాలు చేజారుతాయి. ధన వ్యవహారాలలో కొంత అప్రమత్తంగా వ్యవహరించాలి.

సింహం: నిరుద్యోగులకు నూతన అవకాశములు అందుతాయి. గృహమున శుభకార్యములు నిర్వహిస్తారు. అవసరానికి చేతికి డబ్బు అందుతుంది. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. మిత్రులతో చర్చలు చేస్తారు. వ్యాపారాలలో నష్టాలు భర్తీ అవుతాయి. ఉద్యోగాలలో సమస్యల నుండి బయటపడతారు.

కన్య: ఆప్తుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. నూతన కార్యక్రమాలు ప్రారంభిస్తారు. రావలసిన ధనం చేతికందుతుంది. కుటుంబ సమస్యలు పరిష్కార దిశగా సాగుతాయి. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. సంఘంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. వృత్తి , ఉద్యోగాలు ఉత్సాహంగా సాగుతాయి.

తుల: కుటుంబ సభ్యులతో దూరప్రయాణాలు చేస్తారు. ఋణదాతల ఒత్తిడి నుండి బయటపడటానికి నూతన ఋణాలు చేస్తారు. చేపట్టిన పనుల్లో స్వల్ప అవరోధాలుంటాయి. జీవిత భాగస్వామితో ఆలయాలు సందర్శిస్తారు. వ్యాపారాలలో ధన నష్టాలుంటాయి. ఉద్యోగాలు సామాన్యంగా సాగుతాయి.

వృశ్చికం: వ్యాపారాలు నిదానంగా సాగుతాయి. నిరుద్యోగ ప్రయత్నాలు నిరుత్సాహం కలిగిస్తాయి. కుటుంబ సభ్యుల నుండి ఒత్తిడి పెరుగుతుంది. ఉద్యోగమున అప్పగించిన బాధ్యతలు నిర్వహించడంలో విఫలమౌతారు. చేపట్టిన పనులు నిదానంగా సాగుతాయి. ఆస్తి వ్యవహారాలలో వివాదాలు కలుగుతాయి.

ధనస్సు: సంఘంలో ప్రముఖుల నుండి విశేషమైన ఆదరణ లభిస్తుంది. వ్యాపారస్తులకు నూతన పెట్టుబడులు అందుతాయి. వివాదాలకు సంబందించి కీలక సమాచారం అందుతుంది. మిత్రుల సహాయ సహకారాలతో కొన్ని పనులు పూర్తి చేస్తారు. ఉద్యోగాలలో తెలివిగా సమస్యల నుండి బయటపడతారు.

మకరం: వ్యాపారాలు మరింత మందగిస్తాయి. కుటుంబ వాతావరణం చికాకు కలిగిస్తుంది. ఆకస్మిక ధనవ్యయ సూచనలున్నవి. ఉద్యోగులకు సహోద్యోగులతో మనస్పర్థలు కలుగుతాయి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ప్రయాణాలలో వాహన ఇబ్బందులుంటాయి. ఋణప్రయత్నాలు కలసిరావు.

కుంభం: ఇంటా బయట కీలక నిర్ణయాలు తీసుకుని లాభపడతారు. నూతన ఉద్యోగ అవకాశములు అందుతాయి. వృత్తి వ్యాపారమున వ్యవహార అనుకూలత కలుగుతుంది. పాత సంఘటనలు గుర్తు చేసుకుని బాధపడతారు. ఉద్యోగమున అనుకూల మార్పులు ఉంటాయి. గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు.

మీనం: వ్యాపారాలలో తొందరపడి నిర్ణయాలు తీసుకోవడం మంచిది కాదు. ఆధ్యాత్మిక చింతన కలుగుతుంది. చేపట్టిన పనులు నిదానంగా పూర్తవుతాయి. సన్నిహితుల నుండి ఒక ముఖ్యమైన వ్యవహారంలో కీలక సమాచారం అందుతుంది. ఉద్యోగాలలో శ్రమకు తగిన ఫలితం అందదు. సంతాన విద్యా ఫలితాలు అంతంత మాత్రంగా ఉంటాయి.





# బడ్జెట్ బీమా

**మొదటి పేజీ తరువాయి**

రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా ఈ బడ్జెట్‌ను రూపొందించినట్లు డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. పన్నుల భారం లేకుండా సమతుల్యంగా ఈ బడ్జెట్‌ను తీసుకువచ్చినట్లు స్పష్టం చేశారు. ఏకంగా రెండు గంటల పాటు బడ్జెట్ ప్రసంగాన్ని చదివి వినిపించారు. 'ప్రజల ప్రయోజనాలే పరమావధిగా, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా సాగుతున్న ఈ ప్రజా ప్రభుత్వంలో... వరుసగా నాల్గవసారి 2026-27 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ ను ప్రవేశపెట్టే అవకాశం నాకు కల్పించిన తెలంగాణ ప్రజానీకానికి, ప్రభుత్వానికి, కాంగ్రెస్ నాయకత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. ప్రతి పౌరుడికి సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం అందించడమే పరిపాలన లక్ష్యమని చెప్పిన డాక్టర్ అంబేద్కర్ అడుగుజాడల్లోనే నడుస్తూ మా పాలన సాగిస్తున్నాం. మేము పాలకులం కాదు, ప్రజలకు సేవకులం. ప్రజలు మాకు అప్పగించిన ఈ అధికారాన్ని ఒక బాధ్యతగా భావించి, ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్రాన్ని ప్రగతి పథంలో తీసుకుపోతున్నాం' అని పేర్కొన్నారు.

### ప్రత్యేక కేటాయింపులు

రాజీవ్ యువ వికాసం పథకం: యువత ఆర్థిక స్వయంసమృద్ధికి రూ. 6,000 కోట్లు.

గోదావరి పుష్కరాలు (2027): ఘనంగా నిర్వహించేందుకు రూ. 500 కోట్లు.

హాస్టళ్ల వంటశాలల ఆధునీకరణ: విద్యార్థుల ఆరోగ్యం కోసం రాష్ట్రంలోని అన్ని వసతి గృహాల కిచెన్ల ఆధునీకరణకు రూ. 100 కోట్లు.

### బడ్జెట్‌లో కీలకాంశాలు:

తలసరి ఆదాయం: 2025-26లో రాష్ట్ర తలసరి ఆదాయం రూ. 4,18,931 కి చేరుకుంది. ఇది దేశ సగటు కంటే 1.9 రెట్లు ఎక్కువ.

వృద్ధి రేటు: తెలంగాణ రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి (జీఎస్డీపీ) వృద్ధి రేటు 10.7 శాతంగా నమోదైంది.

భవిష్యత్ లక్ష్యం: 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం.

### కొత్త పథకాలు ఇవే:

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా: జూన్ 2, 2026 నుండి రాష్ట్రంలోని 1 కోటి 15 లక్షల కుటుంబాలకు రూ. 5 లక్షల జీవిత బీమా కల్పించనున్నారు.

విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్ పథకం: ప్రీ-ప్రైమరీ నుండి ఇంటర్మీడియట్ వరకు చదివే విద్యార్థులకు వారంలో మూడు రోజులు పాలు, మరో మూడు రోజులు రాగిజావ ఉదయం బ్రేక్ ఫాస్ట్‌గా అందిస్తారు.

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం: ఇప్పటి వరకు పాఠశాలలకే పరిమితమైన మధ్యాహ్న భోజన పథకాన్ని ఇకపై ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఇంటర్ విద్యార్థులకు కూడా విస్తరిస్తున్నారు.

ఉద్యోగులకు నగదు రహిత వైద్యం (ఈహెచ్ఎస్): ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల కోసం రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్టు ద్వారా నగదు రహిత ఆరోగ్య భద్రత పథకాన్ని అమలు చేస్తారు. దీని ద్వారా 1,998 వ్యాధులకు 421 ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందవచ్చు.

ఉద్యోగులకు ప్రమాద బీమా: ప్రభుత్వ ఉద్యోగులు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.1.20 కోట్ల ప్రమాద బీమా వర్తిస్తుంది.

సీఎం ఓవర్సీస్ ఎంప్లాయిమెంట్ ప్రోగ్రాం: రాష్ట్ర యువతకు విదేశాల్లో (యూఏఈ, జర్మనీ తదితర దేశాల్లో) సురక్షితమైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ కొత్త కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నారు.

# టెన్త్ పరీక్షలు రద్దు!

**12వ తరగతి వరకు ఒకే విధానం..**
**విద్యావిధానంలో మార్పులు చేస్తాం**
**మూసీ ప్రక్షాళన ఆగే ప్రసక్తే ఉండదు..**
**పార్టీ చేతిలో జీవన్ రెడ్డి వ్యవహారం**
**మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్**

హైదరాబాద్, మార్చి 20 (ఈవార్తలు): ఫోన్ ట్యాపింగ్ అరెస్టులు, సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డి వ్యవహారం, విద్యా విధానం అంశాలపై సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీలో భట్టి బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం.. శుక్రవారం మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడిన ఆయన.. విద్యా విధానంలో కీలక మార్పులు తెస్తున్నామని స్పష్టం చేశారు. ఇక టెన్త్ పరీక్షలు ఉండవని చెప్పారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ఒకే విధానం ఉంటుందని, దీనిని ముున్ముందు అమలుచేస్తామని అన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రజా ప్రభుత్వం చేసిన అప్పు రూ.3.47లక్షల కోట్లు అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఇందులో నుంచి గత ప్రభుత్వం చేసిన అప్పులు, వడ్డీలకే రూ. 3.30 లక్షల కోట్లు చెల్లించామని సీఎం తెలిపారు. 'రాష్ట్ర ఆదాయం పెంచుకునేందుకు వివిధ విభాగాల్లో ఉన్న లీకేజీలను అరికడుతున్నాం. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులు తెచ్చుకుంటున్నాం. ఇది ఫ్యూచరిస్టిక్ బడ్జెట్.. అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యమిచ్చాం. రాష్ట్ర అభివృద్ధి, భవిష్యత్ ఆర్థిక వృద్ధిని దృష్టిలో పెట్టుకొని మౌలిక వసతుల కల్పనకు సరిపడే నిధుల కేటాయింపు జరిగింది. తెలంగాణ రైజింగ్ విజన్ లక్ష్యానికి బడ్జెట్ పెద్ద పీట వేసింది. అన్ని రంగాలు, అన్ని వర్గాలకు నిధులు కేటాయించాం. దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి ఇందిరా కుటుంబ జీవిత బీమా పథకం ప్రవేశ పెట్టాం. ఈ పథకం ద్వారా రూ. 5 లక్షల బీమా పరిహారం అందిస్తున్నాం. రాష్ట్రంలోని దాదాపు 1కోటి 15లక్షల కుటుంబానికి ఈ పథకం వర్తించనుంది' స్పష్టం చేశారు. మూసీ ప్రక్షాళన ఆగదని, ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. జగిత్యాలకు చెందిన తమ పార్టీ సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డి వ్యవహారాన్ని టీపీసీసీ అధ్యక్షుడు, పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ చూసుకుంటారని తెలిపారు. అటు, ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టులు కొనసాగుతాయని తెలిపారు. చట్టప్రకారమే ఈ దర్యాప్తు కొనసాగుతోందని అన్నారు. విచారణ జరపకుండానే అరెస్టులు చేయలేం కదా అన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కోర్టు క్లీన్ చిట్ ఇచ్చిందని హరీశ్ రావు అసత్య ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హరీశ్ రావుకు సిద్దిపేటకు చెందిన చక్రధర్ కేసులోనే క్లీన్ చిట్ వచ్చిందని తెలిపారు. పదేళ్లు బీఆర్ఎస్ చేసిన అప్పులకు వడ్డీలు చెల్లిస్తున్నామని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. వాళ్లు చేసిన తప్పులకు చెవిలో పువ్వులు కాదని, వీపుపై బండలు పెట్టాలని అన్నారు. ఫార్ములా ఈ-రేసు కేసులో విచారణకు ఇటీవల కేంద్రం అనుమతి ఇచ్చిందని, ఇప్పటికే ఐఏఎస్ అర్వింద్ కుమార్‌ను సస్పెండ్ చేశామని పేర్కొన్నారు.

# అప్పుల కుప్ప

**మొదటి పేజీ తరువాయి**

ఆర్థిక సంవత్సరాలతో పోలిస్తే ఇది అత్యధికం.

### 2026-27 బడ్జెట్

### నాటికి అప్పులు (రూ. కోట్లలో)

వచ్చే ఆర్థిక సంవత్సరం నాటికి చేరుకోనున్న రూ.5.62 లక్షల కోట్ల అప్పుల్లో ఏయే మార్గాల ద్వారా ఎంతెంత రుణాలు ఉన్నాయన్నది ప్రభుత్వం వివరించింది.

బహిరంగ మార్కెట్ రుణాలు:
రూ.4,62,926 కోట్లు.

కేంద్ర ప్రభుత్వ రుణాలు:
రూ.22,345 కోట్లు.

స్వయంప్రతిపత్తి సంస్థల రుణాలు:
రూ.14,309 కోట్లు.

చిన్న మొత్తాల పొదుపు,
ప్రావిడెంట్ ఫండ్ :
రూ. 25,716 కోట్లు.

రిజర్వ్ ఫండ్స్, డిపాజిట్లు:
రూ.37,067 కోట్లు.

### ఎఫ్ఆర్‌బీఎం పరిమితి?

అప్పులు పెరుగుతున్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం ఒక ముఖ్యమైన విషయాన్ని స్పష్టం చేసింది. ప్రస్తుత పబ్లిక్ డెట్ రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో (జీఎస్డీపీ) 29 శాతంగా ఉంది. ఫిస్కల్ రెస్పాన్సిబిలిటీ అండ్ బడ్జెట్ మేనేజ్మెంట్ (ఎఫ్ఆర్‌బీఎం) చట్టం ప్రకారం.. ఈ అప్పు 30 శాతం లోపు ఉండాలి. ప్రస్తుతం తెలంగాణ 29 శాతంతో ఆ పరిమితికి దిగువనే ఉంది. కాబట్టి ఆర్థికంగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రభుత్వం తన బడ్జెట్ ప్రసంగంలో పేర్కొంది.

# తమిళనాడులో 8 మంది దుర్మరణం

**మొదటి పేజీ తరువాయి**


సేలం బయల్దేరింది. బస్సు వేగంగా వెళ్తుండగా, అదుపుతప్పి తన లేన్ దాటి పక్కకు వచ్చింది. వెంటనే రోడ్డుపై డివైడర్ దాటి మరోవైపు రోడ్డుపైకి దూసుకెళ్లింది. ఈ క్రమంలో అదే రోడ్డుపై అటు నుంచి వస్తున్న టెంపో వాహనాన్ని (గూడ్స్ ఆటో) ఢీకొంది. ఆ తర్వాత అటు నుంచే వస్తున్న బైకును ఢీకొంది. ఈ ఘటనలో టెంపోలోని వారితోపాటు, బైకుపై వెళ్తున్న వారిపై నుంచి బస్సు దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఎనిమిది మంది మరణించారు. టెంపోలో మొత్తం 10 మంది ఉన్నారు. వారంతా ఒకే కుటుంబానికి చెందిన వారు, సమీప బంధువులు. ఒక వేడుకకు వెళ్లి తిరిగి వస్తుండగా బస్సు ఢీకొంది. ఘటనలో ఎనిమిది మంది మరణించగా, మరికొందరికి గాయాలయ్యాయి. క్షతగాత్రుల్లో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. మృతుల్లో చిన్నారులు కూడా ఉన్నారు. మృతులను సెల్వరాజ్, మురుగన్, అమూధ, మణికందన్, ఇరుసాయి, సత్య (మణికందన్ భార్య), ఐదేళ్ల నితీష, 11 నెలల జీవికగా గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు, ఇతర అధికారులు అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బస్సులోని ప్రయాణికులు గాయాలతో బయటపడ్డారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

# షర్మిలకు జగన్ అన్యాయం

**మొదటి పేజీ తరువాయి**

చేశారు. ఆ నోటరీ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ లేఖలో ఆమె తన కుమారుడు జగన్ తీరుపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేయడం గమనార్హం. '2009లో వైఎస్ రాజశేఖర రెడ్డి మరణం వరకున్న ఆస్తులన్నీ కుటుంబ ఆస్తులే. ఆస్తుల పంపకం ఎప్పుడూ జరగ లేదు. అన్ని ఆస్తులను నలుగురు మనుమలకు సమానంగా పంచాలని వైఎస్సార్ ఉద్దేశం. ఇది ఆయన ఆదేశం కూడా. దగ్గర వాళ్ళందరికీ తెలిసిన వాస్తవమిది. ఎంవోయూలో షర్మిలకు రాసిన ప్రతి ఆస్తి న్యాయంగా ఆమెకు చెందాల్సినవే. అందుకే జగన్ ఎంవోయూ రాశాడు (నిజానికి తనకు తక్కువే రాశాడు. సరస్వతి సిమెంట్‌తో సహా ఎంవోయూలో లేని యెలహంక ల్యాండ్ కూడా షర్మిలదే.

ఇచ్చాను అని చెప్తున్న డబ్బు షర్మిల వాటాకు ఇచ్చిన డివిడెండ్ మాత్రమే). ఆస్తుల విషయంలో జగన్ తన మేనల్లుడు, మేనకోడలికి అన్యాయం చేశాడు. ఎప్పటికైనా న్యాయం చేస్తాడని తన తల్లిగా ఆశిస్తున్నాను. ఆస్తుల పంపకం జరగలేదు. షర్మిలకు ఇచ్చినటువంటి ఆస్తుల లాంటివే వైఎస్సార్ జగన్‌కు కూడా ఇచ్చారు. అది ఆస్తి పంపకం కాదు. నిజం ఏమిటో నా దేవుడికి, నా కొడుకుకి కూడా తెలుసు. గోబెల్స్ ప్రచారం చేయడానికి మీరు ఎవరు? మీరు ఎంత కాదన్నా దేవుడి న్యాయమే న్యాయం. అసత్యాల ప్రచారం మానుకోవాలని వైఎస్సార్ భార్యగా చేతులు జోడించి అడుగుతున్నా. మళ్లీ మళ్లీ మీడియాలో ప్రస్తావించొద్దని వేడుకుంటున్నా. దేవుని సాక్షిగా నేను రాసినవన్నీ వాస్తవాలు మాత్రమే" అంటూ విజయమ్మ తన నోటరీలో పేర్కొన్నారు.



# నాటో పిరికిపంద

**మొదటి పేజీ తరువాయి**

ధ్వంసమయ్యాయి. అన్నింటికంటే ముఖ్యంగా, దాదాపు అన్ని స్థాయిలలోని వారి నాయకులు హతమయ్యారు. వారు ఇకపై మనల్ని కానీ, మన మధ్యప్రాచ్య మిత్రదేశాలను కానీ, ప్రపంచాన్ని కానీ ఎప్పటికీ భయపెట్టలేరు. మేము అపారమైన సైనిక విజయాన్ని సాధించాం. మాకు ఇకపై నాటో దేశాల సహాయం అవసరం లేదు. అటువంటి కోరికా లేదు. నిజానికి మాకు అది ఎప్పుడూ అవసరం పడలేదు. జపాన్, ఆస్ట్రేలియా లేదా దక్షిణ కొరియా సహాయం కూడా మాకు అక్కర్లేదు. ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన దేశమైన అమెరికా అధ్యక్షుడిగా నేను చెబుతున్నాను, మాకు ఎవరి సహాయమూ అవసరం లేదు' అని ఘాటు వ్యాఖ్యలు చేశారు.

# భట్టి బడ్జెట్.. వట్టి బడ్జెట్

**మొదటి పేజీ తరువాయి**

బడ్జెట్, పేదలను వంచించిన బడ్జెట్, ఆరు గ్యారంటీలను పాతరేసిన బడ్జెట్ అని విమర్శంచారు. ఈ బడ్జెట్‌లోసకల జనులకు దక్కింది గుండు సున్నా అని, అంకెల గారడీ.. మాటల గారడీ.. తప్ప పేదల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని హరీశ్ రావు విమర్శించారు. మూడుసార్లు రైతుబంధు ఎగ్గొట్టిన సీఎం రేవంత్ ముక్కు నేలకు రాసి రైతులకు క్షమాపణ చెప్పాలి అని డిమాండ్ చేశారు. సకల జనులను సంపూర్ణంగా ముంచిన బడ్జెట్ ఇది అని, ఈ బడ్జెట్‌లో ఆరు గ్యారంటీలకు పోయిన బడ్జెట్ కంటే కేటాయింపుల్లో కోత పెట్టారని, తెలంగాణ ప్రజలను పూర్తిగా దగా చేశారు అన్నారు. ఇప్పటికైనా ప్రజలు కండ్లు తెరిస్తే తప్ప మన హక్కులను సాధించుకోలేం అని హెచ్చరించారు. కేసీఆర్ పాలనలో తెలంగాణ జీఎస్డీపీ 12.5% పెరిగితే..రేవంత్ పాలనలో ఆ సంఖ్య 10.7 శాతానికి తగ్గింది అని పేర్కొన్నారని, అంటే రేవంత్ సర్కార్ ఫెయిల్ అయిందని స్పష్టం అవుతుంది అన్నారు. అంతేకాదు తెలంగాణ జీఎస్పీడీపీ రేటు దేశ సగటు కంటే అధికంగా ఉందన్ని ఆర్థిక మంత్రి భట్టి బడ్జెట్ ప్రసంగంలో చెప్పారని, సీఎం రేవంత్ రెడ్డి మాత్రం బయట రాష్ట్రం దివాళా తీసిందంటున్నారని ఎవరి మాట నమ్మాలని ప్రశ్నించారు. దేశ సగటు కంటే తెలంగాణ అభివృద్ధి రేటు ఎక్కువగా ఉంటే ఆరు గ్యారంటీల అమలులో కోతలు ఎందుకు పెడుతున్నారని నిలదీశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన చేసిన బ్రేక్‌ఫాస్ట్ పథకం ఆపేసి, ఇప్పుడు మళ్లీ ఏదో కొత్తగా వాళ్లే తెచ్చినట్లు డబ్బా కొట్టుకుంటున్నారు అని ఆరోపించారు. టిమ్స్ సనత్‌నగర్ ఆసుపత్రి ప్రారంభోత్సవానికి ఇప్పటికే ఐదు తేదీలు మార్చారు అన్నారు.

# రాజన్న గుడికి ఆధ్యాత్మిక శోభ

## పూర్తి స్థాయి ఆధ్యాత్మిక కేంద్రంగా మార్పు.. డిప్యూటీ భట్టి విక్రమార్క కీలక ప్రకటన

హైదరాబాద్, మార్చి 20 (ఈవార్తలు): తెలంగాణ సాంస్కృతిక, ఆధ్యాత్మిక వారసత్వాన్ని కాపాడేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఇందులో భాగంగానే రాష్ట్రంలో ఆధ్యాత్మిక పర్యాటకాన్ని పెంపొందించేందుకు భద్రాచలం, ధర్మపురి, వేములవాడ, కాళేశ్వరం వంటి దేవాలయాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. ఇందుకు అవసరమైన నిధులను కూడా మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. వేములవాడ రాజన్న దేవాలయాన్ని పూర్తి స్థాయి ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేయనున్నట్లు ఈ సందర్భంగా భట్టి విక్రమార్క ప్రకటించారు. అంతేకాదు, రాష్ట్రంలో ఆధ్యాత్మిక పర్యాటకాన్ని అభివృద్ధి చేయడంతోపాటూ భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని తెలిపారు. రాష్ట్ర దేవాదాయ శాఖ తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థతో కలిసి రాష్ట్రంలో తొమ్మిది కొత్త పవిత్ర యాత్రా సర్క్యూట్లను ప్రారంభించిందని గుర్తు చేశారు. ఈ యాత్రా సర్క్యూట్ల ద్వారా భక్తులకు వసతి సదుపాయాలు, ప్రత్యేక దర్శనం, పర్యాటక సౌకర్యాలు అందించబడుతున్నాయని భట్టి విక్రమార్క వివరించారు.

**పర్యాటక రంగానికి రూ.1,224 కోట్లు**

రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడానికి తమ ప్రభుత్వం తెలంగాణ టూరిజం పాలసీ 2025-2030ను ప్రకటించి అమలు చేస్తున్నట్లు ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ఈ సందర్భంగా తెలిపారు. ఈ పర్యాటక విధానం ద్వారా రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించడం, ఉపాధి అవకాశాలను విస్తరించడం, స్థానిక కళలు, సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి పరిచయం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ విధానానికి ప్రైవేటు రంగం నుండి విశేష స్పందన లభించిందని.. తద్వారా రూ.25,000 కోట్లకు పైగా పెట్టుబడులు ప్రతిపాదనల దశలో ఉన్నాయని భట్టి వెల్లడించారు. చరిత్రలోనే తొలిసారి హైదరాబాద్‌లో మిస్‌వరల్డ్ పోటీలు నిర్వహించినట్లు ఈ సందర్భంగా గుర్తు చేశారు. దీని ద్వారా హైదరాబాద్ విశ్వనగరం ప్రపంచం దృష్టిని ఆకర్షించినట్లు చెప్పారు. ఈ బడ్జెట్‌లో పర్యాటక రంగానికి రూ.1,224 కోట్లు ప్రతిపాదిస్తున్నట్లు భట్టి ప్రకటించారు.



**గోదావరి పుష్కరాలకు రూ.500 కోట్లు**

వచ్చే ఏడాది జరుగనున్న గోదావరి పుష్కరాల కోసం తెలంగాణ ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.500 కోట్లు కేటాయించింది. అసెంబ్లీలో ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క ఈ విషయాన్ని వెల్లడించారు. గోదావరి పుష్కరాలు ప్రతి 12 ఏళ్ల ఒకసారి నిర్వహించే విషయం తెలిసిందే. అత్యంత పవిత్రమైన గోదావరి పుష్కరాలు 2027 జూన్ 26 నుంచి జూలై 7 వరకు జరగనున్నాయి. ఆయా పవిత్ర దినాల్లో సుమారు 8 కోట్ల మంది భక్తులు పుణ్యస్నానాలు చేస్తారని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలో తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా 'కుంభమేళా' తరహాలో పుష్కరాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ పుష్కరాల నిర్వహణ, రోడ్ల విస్తరణ, కొత్త ఘాట్ల నిర్మాణం, దేవాలయాల అభివృద్ధి వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధి ఏర్పాట్లను పర్యవేక్షించడానికి ఇప్పటికే ప్రభుత్వం మంత్రి శ్రీధర్‌బాబు నేతృత్వంలో కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం, భద్రత, రద్దీ నియంత్రణ కోసం ఆధునిక సాంకేతికతను వినియోగించే చర్యలు తీసుకుంటోంది. ఈ గోదావరి పుష్కరాల నిర్వహణ కోసం ఈ బడ్జెట్‌లో రూ.500కోట్లు ప్రతిపాదించినట్లు ఆర్థికమంత్రి తెలిపారు.

## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

*అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.*

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.

# సాగునీటి ప్రాజెక్టులకు 22,615 కోట్లు

హైదరాబాద్, మార్చి 20 (ఈవార్తలు): తెలంగాణలో సాగునీటి ప్రాజెక్టులకు బడ్జెట్‌లో రూ.22,615 కోట్లు ప్రతిపాదిస్తున్నట్లు ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. డిసెంబర్ 2023లో కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడం ప్రభుత్వ ప్రాధాన్యతల్లో ఒకటని తెలిపారు. కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు దక్కాల్సిన న్యాయమైన వాటా కోసం గౌరవ సుప్రీంకోర్టు, ట్రిబ్యునల్, చట్టబద్ధమైన సంస్థలు, భారత ప్రభుత్వం, ప్రతి వేదికపై తమ ప్రభుత్వం సమర్థవంతంగా పోరాడిందన్నారు. ప్రభుత్వానికి గతంలో పెండింగ్‌లో ఉన్న అనేక ప్రాజెక్టులు వారసత్వంగా వచ్చాయన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులైన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం, జవహర్ నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం, రాజీవ్ భీమా ఎత్తిపోతల పథకం, మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం, ఎలిమినేటి మాధవ రెడ్డి శ్రీశైలం ఎడమ గట్టు కాలువ (ఎస్ఎస్‌బీసీ) ప్రాజెక్టు, ఉదయసముద్రం, డిండి ఎత్తిపోతల పథకం, మహాత్మా గాంధీ ఎంబీసీ ఎత్తిపోతల పథకం, జాన్‌పాడ్ ఎత్తిపోతల పథకం, మోతె ఎత్తిపోతల పథకం, జే చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకం, సీతారామ ఎత్తిపోతల పథకం, చిన్న కాళేశ్వరం ఎత్తిపోతల పథకం, గౌరవెల్లి ప్రాజెక్టు, ఎర్రపాలెం జవహర్లాల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్, త్రివేణి సంగమం, పులిమడుగు వాగు, కుమరం భీం వాగు, చిక్మాను వాగు, కెరామేరి మండలంలోని అమ్మవారి మడగాస్కర్, లెండిగూడ-జైనూర్ (మంటో), రోసీ మాల్టా మినీ రిజర్వాయర్ మరియు ఇతర ముఖ్యమైన ప్రాజెక్టులను పూర్తి చేసే దిశగా కృషి చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం చేసిన చారిత్రక తప్పిదాన్ని తమ ప్రభుత్వం సరిదిద్ది, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును కూడా చేపడుతుందన్నారు. గతంలో పనులు ప్రభుత్వం సకాలంలో పూడిక చేపట్టకపోవడంతో అనేక ప్రాజెక్టులలో పూడిక (సెడిమెంటేషన్) పేరుకుపోయి రిజర్వాయర్లలో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయిందన్నారు. భారత ప్రభుత్వ జలశక్తి మంత్రిత్వ శాఖ 'జాతీయ పూడికతీత మార్గదర్శకాల' ప్రకారం.. ఇప్పటికే 'ఆదాయ ఉత్పత్తి విధానం' చేపట్టిన కడెం, లోయర్ మానేరు డ్యామ్ మరియు మిడ్ మానేరు డ్యామ్ ప్రాజెక్టులతో పాటుగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టు, ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు, మూసీ, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల్లో కోల్పోయిన నీటి నిల్వ సామర్థ్యాన్ని పునరుద్ధరించడానికి పూడికతీత పనులను చేపడుతున్నామని వివరించారు.






# విద్యార్థులకు నెలకు రూ.2 వేలు

**ఇంటర్ విద్యార్థులకు కొత్త పథకం**

హైదరాబాద్, మార్చి 20 (ఈవార్తలు): తెలంగాణలోని ఇంటర్, ఐటీఐ విద్యార్థులకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఇప్పటివరకు ప్రభుత్వ పాఠశాలలకే పరిమితమైన మధ్యాహ్న భోజన పథకాన్ని ఇకపై ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లోనూ అమలు చేయనున్నట్లు ప్రకటించింది. దీంతో పాటు, ఐటీఐ, ఏటీసీలలో చదివే విద్యార్థులకు నెలకు రూ.2,000 చొప్పున ఉపకార వేతనం అందించనున్నట్లు వెల్లడించింది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్‌ను ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు భరోసా కల్పించే ఈ రెండు కీలక పథకాలను ప్రకటించారు. పాఠశాల విద్యార్థుల్లాగే ఇంటర్ విద్యార్థులకు కూడా పౌష్టికాహారం అందించే లక్ష్యంతో మధ్యాహ్న భోజన పథకాన్ని విస్తరిస్తున్నట్లు తెలిపారు. వృత్తి విద్యా కోర్సులు చదివే ఐటీఐ, ఏటీసీ విద్యార్థులను ఆర్థికంగా ఆదుకునేందుకు ఉపకార వేతనం అందిస్తున్నట్లు వివరించారు. మొత్తం రూ.3,24,234 లక్షల కోట్లతో ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్‌లో ప్రభుత్వం విద్యాశాఖకు పెద్దపీట వేసింది. ఈ విద్యా సంవత్సరానికి గాను విద్యాశాఖకు రూ.26,674 కోట్లను కేటాయించింది. ఇందులో భాగంగానే విద్యార్థుల సంక్షేమం కోసం ఈ కొత్త పథకాలను ప్రకటించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది ఇంటర్, ఐటీఐ విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది.

# ఎస్ఎల్‌బీసీ పునరుద్ధరణ ప్రారంభం

**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి**




హైదరాబాద్, మార్చి 20 (ఈవార్తలు): ఎస్.ఎల్.బి.సి ఇన్లెట్ తవ్వకాల పునరుద్ధరణ పనులు ప్రారంభం అయ్యాయని రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ఇప్పటికే దేవరకొండ నుండి ఔట్లెట్ పనులు ప్రారంభం అయిన నేపధ్యంలో ఇప్పుడు ఇన్లెట్ పనులు కుడా ప్రారంభమయిన నేపథ్యంలో ఎస్.ఎల్.బి.సి తవ్వకాలు వేగవంతం అయ్యాయని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం డాక్టర్ బి.ఆర్.అంబెద్కర్ సచివాలయంలో ఎస్.ఎల్.బి.సి తో పాటు, డిండి ఎత్తిపోతల పథకం, అచ్చంపేట బ్రాంచ్ కెనాల్ పురోగతిపై ఆయన ప్రత్యేకంగా సమీక్ష సమావేశం నిర్వహించారు. నీటిపారుదల శాఖా ప్రధాన కార్యదర్శి ఇ. శ్రీధర్,ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, జాయింట్ సెక్రటరీ కే. శ్రీనివాస్ తదితరులు ఈ సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రెండు వైపులా తవ్వకాలు ప్రారంభం అయినందున ఇకపై నిరంతరాయంగా పనులు కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. ప్రపంచంలోనే అత్యంత పొడవైన సొరంగ మార్గాంగ నిలువనున్న ఈ ప్రాజెక్ట్ తవ్వకాలలో భద్రతా ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు నిబంధనలు కటినంగా పాటించాలని ఆయన అధికారులను ఆదేశించారు. తవ్వకాల సమయంలో సొరంగ మార్గం చివరికంటూ గాలి వెలుతురు ప్రసారం అయ్యేలా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు. యిన్లెట్ వైపు పనులు పునఃప్రారంభం కావడానికి ముందే 20 మీటర్ల దూరం ఓపెన్ కట్ చేయడంతో పాటు అదనపు భద్రతా చర్యలను పకడ్బందీగా చేపట్టినట్లు ఆయన వివరించారు. ఇప్పటికే తవ్వకాలు ప్రారంభించిన ఔట్ లెట్ తవ్వకాలలో ఆధునిక పరిజ్ఞానాన్ని వినియోగించి 20 మీటర్ల దూరం పూర్తి చేశామని ఆయన తెలిపారు. ఏడూ సంవత్సరాలుగా ఔట్ లెట్ పనులు నిలిచి పోయిన విషయాన్ని ఆయన ప్రస్తావిస్తూ 43.93 కిలోమీటర్ల పొడవైన ఎస్.ఎల్.బి.సి సొరంగ మార్గం శ్రీశైలం ఎడమ కాలువ భాగం నుండి మొదలు పెట్టిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఇది పూర్తి అయితే ప్రపంచంలోనే అత్యంత పొడవైన సొరంగ మార్గంగా ఇది నిలిచి పోతుందన్నారు. అయితే 2025 ఫిబ్రవరిలో దురదృష్టవశాత్తు జరిగిన ఘటనతో పనులు నిలిచి పోయాయన్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించి ఎస్.ఎల్.బి.సి పనుల పునరుద్ధరణకు ఉన్నత స్థాయి కమిటీ నియమించి,కమిటీ సిఫార్సుల మేరకు పునరుద్ధరణ పనులు ప్రారంభించామన్నారు.




## ఆరు గ్యారెంటీలకు
# 50,713 కోట్లు

హైదరాబాద్, మార్చి 20 (ఈవార్తలు): అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ఆ హామీలను నెరవేర్చే దిశగా అడుగులు వేస్తోంది. అసెంబ్లీ ఎన్నికలు మరో రెండేండ్లలో రానున్న నేపథ్యంలో సంక్షేమ పథకాలకు పెద్దపేట వేశారు. ఆరు గ్యారెంటీలను తప్పనిసరిగా అమలు చేయాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్తున్నట్లు ఈ బడ్జెట్ ద్వారా స్పష్టమైంది. ఇప్పటి వరకు మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో పాటు గృహ జ్యోతి పథకాన్ని అమలు చేస్తున్నారు. చేయూత పథకం ఇప్పటి వరకు అమలు కాలేదు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కొనసాగుతోంది. వ్యవసాయ ఉత్పత్తులకు కూడా బోనస్ కార్యక్రమం సరిగా అమలు కావడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఎల్పీజీ సిలిండర్లకు సబ్సిడీ రాలేదనే అపవాదులు ఉన్నాయి. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కూడా ఇప్పటికీ అమలు కాలేదు. ఈ నేపథ్యంలో ఆరు గ్యారెంటీలకు రూ. 50,713 కోట్లు కేటాయిస్తున్నట్లు బడ్జెట్‌లో పేర్కొన్నారు.

**ఆరు గ్యారెంటీలకు కేటాయింపులు ఇలా..**

- **రైతు భరోసా - రూ. 18000 కోట్లు**
- **చేయూత - రూ. 14861 కోట్లు**
- **ఇందిరమ్మ ఇండ్లు - రూ. 5,500 కోట్లు**
- **మహాలక్ష్మి (ఆర్టీసీ) - రూ. 4305 కోట్లు**
- **వ్యవసాయ ఉత్పత్తులకు బోనస్ - రూ. 3,500 కోట్లు**
- **గృహ జ్యోతి(200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్) - రూ. 2,080 కోట్లు**
- **రాజీవ్ ఆరోగ్య శ్రీ - రూ. 1,143 కోట్లు**
- **ఎల్పీజీ సబ్సిడీ - రూ. 723 కోట్లు**
- **ఇందిరమ్మ ఆత్మీయ భరోసా - రూ. 600 కోట్లు**

# కొత్తగా 2 లక్షల చేయూత పింఛన్లు



హైదరాబాద్, మార్చి 20 (ఈవార్తలు): తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని పేదలు, వృద్ధులు, అభాగ్యులకు అండగా నిలుస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. 'చేయూత' పథకం కింద కొత్తగా మరో 2 లక్షల మందికి పింఛన్లు మంజూరు చేయనున్నట్లు ప్రకటించింది. శాసనసభలో 2026-27 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన సందర్భంగా ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ఈ తీపి కబురు అందించారు. ఈ నిర్ణయంతో, చాలా కాలంగా కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులకు పెద్ద ఊరట లభించినట్లయింది. తమ ప్రభుత్వం సంక్షేమానికే ప్రథమ ప్రాధాన్యత ఇస్తుందని భట్టి విక్రమార్క ఈ సందర్భంగా స్పష్టం చేశారు. బడ్జెట్ కేవలం అంకెల గారడీ కాదని, క్షేత్రస్థాయిలో ప్రతి పేదవాడికి ప్రయోజనం చేకూరాలన్నదే తమ లక్ష్యమని ఆయన వివరించారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నిరుపేదల కళ్లలో ఆనందం చూడాలన్నదే తమ ప్రభుత్వ తపన అని, ఈ అదనపు పింఛన్ల మంజూరుతో లక్షలాది కుటుంబాల్లో కొత్త వెలుగులు నిండుతాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు. కొత్త పింఛన్ల పంపిణీకి ఎలాంటి ఆటంకాలు లేకుండా బడ్జెట్‌లో తగినన్ని నిధులు కేటాయించినట్లు ఆర్థిక మంత్రి తెలిపారు. ఇప్పటికే పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను గ్రామ, వార్డు స్థాయిల్లో అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తారని చెప్పారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ అత్యంత పారదర్శకంగా ఈ సామాజిక భద్రతా పింఛన్లను అందజేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న పింఛన్ లబ్ధిదారులకు అదనంగా ఈ రెండు లక్షల మంది చేరనున్నారు. ఈ చేయూత పథకం ద్వారా వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులతో పాటు వివిధ చేతివృత్తుల వారు ఆర్థిక భరోసా పొందనున్నారు. సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలు చేస్తూ, అర్హులైన అందరికీ న్యాయం చేయడమే తమ ప్రభుత్వ ప్రధాన కర్తవ్యమని భట్టి విక్రమార్క పునరుద్ఘాటించారు.

# ఇజ్రాయెల్‌కు తమ్ముడిలా పాక్



హైదరాబాద్, మార్చి 20 (ఈవార్తలు): ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పాకిస్తాన్, అలాగే కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని మక్కా మసీదులో జరిగిన ఒక బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ అంతర్జాతీయ పరిణామాలు, దేశీయ అంశాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'పాక్ ఇజ్రాయెల్‌కు తమ్ముడి లాంటిది' అంటూ ఒవైసీ సంచలన వ్యాఖ్యలు చేశారు. పొరుగు దేశమైన ఆఫ్ఘనిస్తాన్‌పై పాకిస్తాన్ బాంబుల దాడి చేసి 400 మంది అమాయకులను చంపడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ రెండు దేశాలు తమ పొరుగు వారిని ప్రశాంతంగా ఉండనివ్వవని మండిపడ్డారు. పాకిస్తాన్‌కు ఇస్లాం ప్రాథమిక సూత్రాలే తెలియవని, అమాయకుల ప్రాణాలు తీయడం దారుణమని ఆయన ఎద్దేవా చేశారు. అటు.. పశ్చిమ ఆసియా విషయంలో గతంలో భారత్ అనుసరించిన తటస్థ వైఖరిని ప్రధాని మోడీ పక్కన పెట్టారని ఒవైసీ ఆరోపించారు. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు, అమెరికా ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్‌లతో మోడీ పెంచుకున్న అతి సాన్నిహిత్యం వల్ల భారత్ తన పట్టు కోల్పోయిందని ఆయన విమర్శించారు. పశ్చిమ ఆసియా దేశాల్లో దాదాపు ఒక కోటి మంది భారతీయులు ఉపాధి పొందుతున్నారని, భారత్‌కు వచ్చే విదేశీ మార్పిడిలో 50 శాతం వారి నుంచే వస్తుందని ఆయన గుర్తుచేశారు. ఒకవేళ యుద్ధం వల్ల అక్కడి ఆర్థిక వ్యవస్థలు దెబ్బతిని భారతీయులు తిరిగి వస్తే, మోడీ వారికి ఉపాధి కల్పిస్తారా? అని ప్రశ్నించారు. దేశంలో చమురు నిల్వలపై కూడా ఒవైసీ ఆందోళన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ నిబంధనల ప్రకారం 90 రోజులకు సరిపడా నిల్వలు ఉండాలని, కానీ భారత్ వద్ద కేవలం 9.50 రోజులకు సరిపడా మాత్రమే ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్ గంగా నదిలో ఇఫ్తార్ విందు చేసుకున్న కొంత మందిపై కేసులు నమోదు చేయడాన్ని ఆయన వివక్షగా అభివర్ణించారు. అలాగే, దేశంలో 67 శాతం మంది గ్రాడ్యుయేట్లు నిరుద్యోగులుగా ఉన్నారని, యువతను వాస్తవ సమస్యల నుంచి పక్కదారి పట్టించి మతపరమైన చిచ్చు పెడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

## హైదరాబాద్‌లోని ఉద్యోగులకు గుడ్ న్యూస్

**హెచ్‌ఆర్‌ఏపై కేంద్ర ప్రభుత్వం తీపికబురు**

న్యూఢిల్లీ: తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో ఉద్యోగం చేసేవారికి కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఇంటి అద్దె భత్యం (హెచ్‌ఆర్‌ఏ) మినహాయింపును 50 శాతానికి పెంచింది. ఇప్పటి వరకు ముంబై, కోల్‌కతా, ఢిల్లీ, చెన్నై నగరాలను మాత్రమే మెట్రో నగరాలుగా పరిగణించేవారు. దీనితో ఆయా నగరాల్లో హెచ్‌ఆర్‌ఏ మినహాయింపు పరిమితి 50 శాతంగా ఉంటోంది. తాజాగా ఈ జాబితాలో హైదరాబాద్‌తో పాటు బెంగళూరు, పుణే, అహ్మదాబాద్ చేరాయి. ఆదాయపు పన్ను నిబంధనలు, 2026ను కేంద్రం నోటిఫై చేసింది. ఆరు దశాబ్దాల పాత ఆదాయపు పన్ను చట్టం-1961 స్థానంలో కొత్త ఆదాయపు పన్ను చట్టాన్ని ప్రభుత్వం అమల్లోకి తెస్తోంది. ఇందులో భాగంగా ఏప్రిల్ 1 నుంచి రాబోయే కొత్త నిబంధనలను నోటిఫై చేస్తూ గెజిట్ జారీ చేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరంతో 8 నగరాల్లోని ఉద్యోగులకు తమ వేతనంలో 50 శాతం వరకు హెచ్‌ఆర్‌ఏ కింద పన్ను మినహాయింపును పొందవచ్చు. 2027 జులైలో ఫైల్ చేయబోయే రిటర్నుల సమయంలో ఇది వర్తిస్తుంది. హెచ్‌ఆర్‌ఏ మినహాయింపు పొందాలంటే ఇకపై పన్ను చెల్లింపుదారులు తాము నివసిస్తున్న ఇంటి యజమానితో తమకు ఉన్న సంబంధాన్ని తప్పనిసరిగా వెల్లడించవలసి ఉంటుంది. ఫారమ్ 124లో ఈ వివరాలు నమోదు చేయాలి. పార్లమెంటు ఆగస్ట్ 12న కొత్త ఆదాయపు పన్ను బిల్లుకు ఆమోదం తెలిపింది.

# స్వదేశీ సాంకేతికతతో క్రిటికల్ మినరల్స్

**రేర్ ఎర్త్ పర్మినెంట్ మ్యాగ్నెట్స్ తయారీ**

**స్వయంప్రతిపత్తి దిశగా కీలక అడుగు**

**హైదరాబాద్‌లో పైలట్ ప్లాంట్ ఏర్పాటు**



హైదరాబాద్, మార్చి 20 (ఈవార్తలు): క్రిటికల్ మినరల్స్ (కీలక ఖనిజాల) రంగంలో భారత్ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి సాధించే దిశగా కీలక అడుగు పడింది. హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ అడ్వాన్స్‌డ్ రిసెర్చ్ సెంటర్ ఫర్ పౌడర్ మెటలర్జీ అండ్ న్యూ మెటీరియల్స్ (ఏఆర్సీఐ)లో ఏర్పాటుచేసిన రేర్ ఎర్త్ పర్మినెంట్ మ్యాగ్నెట్స్ ఎన్డీ-ఎఫ్ఈ-బీ (నియోడైమియం-ఐరన్-బోరాన్) పైలట్ ప్లాంట్‌ను కేంద్ర శాస్త్ర, సాంకేతిక విభాగం కార్యదర్శి ప్రొఫెసర్ అభయ్ కరాండికర్, ఏఆర్సీఐ డైరెక్టర్ డాక్టర్ ఆర్ విజయ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ ప్లాంట్‌లో ముడి మిశ్రమ ధాతువుల నుంచి పూర్తి స్థాయి అయస్కాంతాల వరకు స్వదేశీ సాంకేతికతతోనే తయారు చేస్తారని వారు తెలిపారు. ప్రస్తుతం రేర్ ఎర్త్ మాగ్నెట్ సరఫరా కేవలం కొన్ని దేశాల వద్దే కేంద్రీకృతమై ఉందని, ఈ ప్లాంట్ ద్వారా ఇతర దేశాలపై ఆధారపడటం తగ్గుతుందన్నారు. ఈవీ రంగంతో పాటు అధునాతన తయారీ రంగాల్లో పెరుగుతున్న డిమాండ్‌ను ఈ ప్లాంట్ భర్తీ చేస్తుందన్నారు. ఎలక్ట్రిక్ వాహనాలు, పునరుత్పాదక ఇంధన వ్యవస్థలు, ఎలక్ట్రానిక్స్, అధునాతన తయారీ సాంకేతికతలలో ఈ అయస్కాంతాలు అత్యవసరమైన భాగాలు అని వెల్లడించారు. డీప్-టెక్ స్టార్టప్‌లు, ప్రైవేట్ సంస్థలు ఈ వేదికను వినియోగించుకుని వికసిత్ భారత్-2047 లక్ష్యానికి తోడ్పడాలని కరాండికర్ పిలుపునిచ్చారు. సంస్థాగత విధానాలు, మిషన్-ఆధారిత కార్యక్రమాల ద్వారా పరిశోధనలను భారీ ఆవిష్కరణలుగా మార్చడానికి ఒక అనుకూలమైన వ్యవస్థను నిర్మిస్తున్నామని అన్నారు. సరికొత్త సాంకేతికతలలో భారతదేశాన్ని ప్రపంచ అగ్రగామిగా నిలబెట్టడంలో భాగస్వాములు కావాలని పరిశ్రమలు, అంకుర సంస్థలు, విద్యాసంస్థలను ఆహ్వానించారు. ఖనిజాల నుంచి అయస్కాంతాల తయారీ వరకు వాల్యూ చైన్ అంతటా స్వదేశీ సామర్థ్యాలను స్థాపించడం వల్ల సరఫరా భద్రత, పోటీతత్వం, సాంకేతిక నాయకత్వం పెరుగుతాయని, ఖర్చు తగ్గుతుందని అన్నారు. సాంకేతికత ధ్రువీకరణ, సులభతర ప్రక్రియ, పరిశ్రమల సహకారం, ప్రదర్శన, స్వదేశీ ఆవిష్కరణలను వాణిజ్య తయారీ స్థాయికి తీసుకెళ్లడం, డీప్-టెక్ స్టార్టప్‌లు, ప్రైవేట్ రంగ భాగస్వామ్యానికి మద్దతు ఇవ్వడానికి ఈ పైలట్-స్కేల్ ప్లాంట్ ఒక కీలక వేదికగా ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో భారత ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక విభాగం మాజీ కార్యదర్శి, ఏఆర్సీఐ గవర్నింగ్ కౌన్సిల్ ఛైర్మన్ ప్రొఫెసర్ అశుతోశ్ శర్మ, మిధాని, మాజీ సీఎండీ, టెక్నికల్ రివ్యూ కమిటీ మెంబర్ డాక్టర్ ఎస్.కె.ఝా, అనుసంధాన్ నేషనల్ రిసెర్చ్ ఫౌండేషన్(ఏఎన్ఆర్ఎఫ్) సీఈవో డాక్టర్ శివకుమార్ కల్యాణరామన్‌తో పాటు వివిధ పరిశ్రమలు, జాతీయ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.







# ఐదుగురు విద్యార్థులకు కర్క ముత్తారెడ్డి అవార్డులు

హైదరాబాద్, మార్చి 20 (ఈవార్తలు) వసుంధర విజ్ఞాన వికాస మండలి 33వ వార్షికోత్సవం సందర్భంగా జాతీయ స్థాయిలో నిర్వహించిన తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కర్కముత్తారెడ్డి స్మారక కవితల పోటీలో పాఠశాల విద్యార్థుల విభాగంలో ఐదుగురు విద్యార్థులు విజేతలుగా నిలిచారు. వారిలో ఎస్ నీరజ్ (9వ తరగతి జెడ్పీహెచ్ఎస్ - ఆలేరు), నర్సింగోజు సమన్విత (9వ తరగతి జెడ్పీహెచ్ఎస్ - తొగర్రాయి, దుగ్గొండి, వరంగల్), జీ.మీనాక్షి (9వ తరగతి, అరవిందో మోడల్ స్కూల్, మంగళగిరి, ఆంధ్రప్రదేశ్), పీ ఆధ్య (6వ తరగతి విజయ ఉన్నత పాఠశాల- నిజామాబాద్), ఎస్. నిష్కశ్రీ (7వ తరగతి - విజయ హైస్కూల్, నిజామబాద్) ఉన్నారని వసుంధర విజ్ఞాన వికాస మండలి వ్యవస్థాపకుడు, అధ్యక్షుడు మధుకర్ వైద్యుల తెలిపారు. ఈ కవితల పోటీకి ప్రభుత్వ కాళోజీ పురస్కార గ్రహీత కోట్ల వెంకటేశ్వరరెడ్డి న్యాయ నిర్ణేతగా వ్యవహరించారని వెల్లడించారు. విజేతలకు ఈ నెల 26న హైదరాబాద్ రవీంద్రభారతీలో జరిగే సంస్థ 33వ వార్షికోత్సవంలో బహుమతులు అందజేస్తామని, విజేతలను రూ.1000 నగదు, మెమెంటో, శాలువాతో సత్కరిస్తామని పేర్కొన్నారు.

# గోదావరిలో ఐదుగురు విద్యార్థులు గల్లంతు

పోలవరం, మార్చి 20 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం జిల్లాలో శుక్రవారం ఘోర విషాదం చోటుచేసుకుంది. గోదావరి నదిలో స్నానానికి వెళ్లి ఐదుగురు ఇంజినీరింగ్ విద్యార్థులు గల్లంతయ్యారు. ఇప్పటివరకు ముగ్గురి మృతదేహాలను వెలికితీయగా, మరో ఇద్దరి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. పోలీసుల వివరాల ప్రకారం, అమరావతిలోని ఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్న ఏడుగురు విద్యార్థులు ఉగాది సెలవుల సందర్భంగా విహారయాత్రకు వెళ్లారు. భద్రాచలం సందర్శన అనంతరం ఎటపాక మండలం పురుషోత్తపట్నం వద్ద గోదావరి నదిలో స్నానం చేసేందుకు దిగారు. నది లోతుపై అవగాహన లేకపోవడంతో నీటి ప్రవాహానికి ఐదుగురు కొట్టుకుపోయారు. మరో ఇద్దరు విద్యార్థులు చాకచక్యంగా ఒడ్డుకు చేరుకున్నారు. సమాచారం అందుకున్న స్థానికులు, పోలీసులు పడవల సాయంతో గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో సి. శ్రీకర్ (భద్రాచలం), పి. అభిరామ్ (విజయనగరం), నవదీప్ (ఉయ్యూరు) మృతదేహాలు లభ్యమయ్యాయి. గల్లంతైన గోక తేజ (ఉయ్యూరు), పాశం సతీష్ కుమార్ (మదనపల్లె) కోసం గాలింపు కొనసాగుతోంది. ప్రమాదం నుంచి బయటపడిన వారిని చందూరి దీపక్, గడ్డం హర్షవర్ధన్‌గా గుర్తించారు.

# ఏపీలో పలువు ఐఏఎస్‌ల బదిలీ

అమరావతి, మార్చి 20 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ యంత్రాంగంలో పలు కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మార్పుల్లో భాగంగా, అత్యంత కీలకమైన రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్‌డీఏ) నూతన కమిషనర్‌గా విజయరామరాజును నియమించింది. ఇప్పటివరకు సీఆర్‌డీఏ కమిషనర్‌గా ఉన్న కె. కన్నబాబును పౌర సరఫరాల శాఖ కమిషనర్‌గా బదిలీ చేశారు. ఆయన స్థానంలో విజయరామరాజుకు ఈ బాధ్యతలు అప్పగించారు. ఈ బదిలీ అమరావతి అభివృద్ధి పనుల నేపథ్యంలో ప్రాధాన్యం సంతరించుకుంది. ఇదే సమయంలో మరికొన్ని ముఖ్యమైన నియామకాలు కూడా జరిగాయి. మార్కాపురం జిల్లా కలెక్టర్‌గా విజయ సునీతను, పోలవరం జిల్లా కలెక్టర్‌గా దినేశ్ కుమార్‌ను ప్రభుత్వం నియమించింది. పౌర సరఫరాల శాఖ కమిషనర్‌గా ఉన్న సౌరభ్ గౌర్‌ను ప్రభుత్వం రిలీవ్ చేసింది. అలాగే, రవి సుభాష్‌కు వ్యవసాయం, మార్కెటింగ్ శాఖల పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించారు. ఈ బదిలీలు పరిపాలనను మరింత పటిష్టం చేసే దిశగా ప్రభుత్వం తీసుకున్న చర్యలుగా భావిస్తున్నారు.

# ఏపీకి భారీ వర్ష సూచన



అమరావతి/విశాఖపట్నం, మార్చి 20 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రానున్న మూడు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురుస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఏపీ తీరం, దాని పరిసర ప్రాంతాల్లో సముద్ర మట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని, దీని ప్రభావంతో వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయని తెలిపింది. దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లోని పలుచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. దక్షిణ కోస్తాలో అక్కడక్కడా వడగళ్ల వాన పడే సూచనలు ఉన్నాయని పేర్కొంది. ఈ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని, కొన్ని సమయాల్లో గాలి వేగం గంటకు 60 కిలోమీటర్లకు చేరవచ్చని అప్రమత్తం చేసింది. ఇక ఉత్తర కోస్తాంధ్ర, యానాంలోనూ శుక్రవారం చాలాచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు పడతాయని తెలిపింది. ఈ ప్రాంతంలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని వివరించింది. ఉపరితల ఆవర్తనంతో పాటు గల్ఫ్ ఆఫ్ మన్నార్ నుంచి తమిళనాడు మీదుగా కర్ణాటక వరకు సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో మరో ద్రోణి విస్తరించి ఉండటం కూడా ఈ వర్షాలకు కారణంగా అధికారులు పేర్కొన్నారు. రాబోయే రెండు, మూడు రోజుల పాటు రాష్ట్రంలో ఇదే తరహా వాతావరణం కొనసాగుతుందని, ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉష్ణోగ్రతల్లో మొదటి మూడు రోజులు పెద్దగా మార్పులు ఉండవని, ఆ తర్వాత స్వల్పంగా పెరిగే అవకాశం ఉందని తెలిపారు.

# అర్హత లేనివాళ్లకు టీటీడీ బాధ్యతలు

**బీఆర్ నాయుడు రాజీనామా చేయాలి**

**మాజీమంత్రి ఆర్కే రోజా తీవ్ర మండిపాటు**



తాడేపల్లి, మార్చి 20 (ఈవార్తలు): ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు పంచాంగ శ్రవణం సాక్షిగా ప్రజలకు అబద్ధాలు చెప్పారని మాజీ మంత్రి, వైసీపీ నాయకురాలు ఆర్కే రోజా మండిపడ్డారు. ప్రజలు సంతోషంగా ఉన్నారన్న సీఎం చంద్రబాబు వ్యాఖ్యలపై ఆమె ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను తుంగలో తొక్కిందని దుయ్యబట్టారు. 18 ఏళ్లు దాటిన ప్రతి మహిళకు నెలకు రూ. 1,500 ఇస్తామన్న హామీ ఏమైంది? అది కేవలం ఓట్ల కోసమేనా? అని ఆమె ప్రశ్నించారు. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, గత జగనన్న పాలనలో రైతులు, పేదలు ఎలా సంతోషంగా ఉన్నారో ప్రజలందరికీ తెలుసని ఆమె గుర్తు చేశారు. నెలకు రూ. 3,000 నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి యువతను నట్టేట ముంచారని, రాష్ట్రంలో నిరుద్యోగులు, రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే సమయంలో, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు తీరుపై కూడా రోజా విమర్శలు గుప్పించారు. టీటీడీ ఛైర్మన్ పదవి నాకు అన్నం పెడుతుందా, నాకు హైదరాబాద్‌లో చాలా వ్యాపారాలు ఉన్నాయి అని బీఆర్ నాయుడు అన్నారని ఆమె మండిపడ్డారు. "అర్హత లేని వారికి పదవులు ఇస్తే ఇలానే మాట్లాడుతారు. తిరుమల పవిత్రతను దెబ్బతీసేలా ప్రవర్తిస్తున్న బీఆర్ నాయుడు తక్షణమే రాజీనామా చేయాలి. అలాంటి వ్యక్తులను తరిమి తరిమి కొట్టాలి" అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

# ఒక్కో కుటుంబంపై రూ.9 లక్షల అప్పు

**ఇది ఫ్యాబ్రికేటెడ్ బడ్జెట్: కవిత**



హైదరాబాద్, మార్చి 20 (ఈవార్తలు): తెలంగాణ డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఫేక్, రివిజన్, ఫ్యాబ్రికేటెడ్ బడ్జెట్ ప్రవేశపెట్టిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. బీసీలు, మహిళలు, నిరుద్యోగులు, రైతులు, వికలాంగులు, మైనార్టీల ఇలా అన్ని వర్గాలకు బడ్జెట్ లో అన్యాయం చేశారని అన్నారు. బంజారాహిల్స్ లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రెస్ మీట్ లో మాట్లాడారు. రైతుభరోసా, చేయూత పింఛన్లు సహా చాలా రంగాలకు గతేడాది కేటాయించిన నిధులనే అక్షరం మార్చకుండా అలాగే కొత్త బడ్జెట్ లోనూ పెట్టారని తెలిపారు. ఈ ప్రభుత్వానికి కనీస విజన్ కూడా లేదని అందుకే ఇది రివిజన్ బడ్జెట్ అంటున్నామని మండిపడ్డారు. ఏటా బీసీలకు రూ. 20 వేల కోట్లు కేటాయిస్తామంటూ రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఫేకారని.. కానీ బడ్జెట్ లో మాత్రం 4 శాతం నిధులే కేటాయించి బీసీలను మోసం చేశారన్నారు. రాష్ట్ర జనాభాలో 56 శాతం మంది ఉన్న బీసీలకు 4 శాతం నిధులు ఇవ్వడం ఏమిటని కల్వకుంట్ల కవిత నిలదీశారు. లక్షల కోట్లు అప్పులు తెస్తున్న రేవంత్ సర్కార్ ఆ డబ్బులను ఏం చేస్తుందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ప్రశ్నించారు. దాదాపు 8 లక్షల 64 వేల కోట్లు అప్పు చేసి ప్రతి ఒక్కరి తలపై రూ. 2 లక్షల 16 వేల భారం మోపారని మండిపడ్డారు. ఒక్కో కుటుంబంపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం రూ.9 లక్షల అప్పుల భారం మోపిందని అన్నారు. లక్షల కోట్ల అప్పులు తెచ్చినా ప్రజలకు మాత్రం పైసా మేలు జరగలేదని అన్నారు. మోడీ తన బడే భాయ్ అంటూ ఎన్నోసార్లు ఢిల్లీకి వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి కేంద్రం నుంచి ఒక్క పైసా కూడా ఎందుకు తేలేదో చెప్పాలని నిలదీశారు. ప్రజలకు మేలు చేయటం చేతకాని కాంగ్రెస్ నాయకులు ఒకరిని మించి ఒకరు ఫేక్ తున్నారని మండిపడ్డారు. అందుకే ఇది ఫేక్, ఫేకర్, ఫేకెస్ట్ ప్రభుత్వమని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత విమర్శించారు.

**రాహుల్ గాంధీ హామీలన్నీ ఫేక్**

ఎన్నికల సమయంలో తెలంగాణకు వచ్చి పెద్ద ఎత్తున హామీలిచ్చిన రాహుల్ గాంధీపై కవిత తీవ్ర విమర్శలు చేశారు. ఆయన ఇచ్చిన హామీలన్నీ కూడా ఫేకే అన్నారు. హైదరాబాద్ లో సలీం ఫేక్ అనే నటుడి మాదిరిగానే రాహుల్ గాంధీ కూడా ఫేక్ మాటలు చెబుతుంటాడని విమర్శించారు. అందుకే ఇక నుంచి రాహుల్ గాంధీకి రాహుల్ ఫేక్ గా నామకరణం చేస్తున్నామన్నారు. సలీం ఫేక్ తన మాటలతో నవ్విస్తే...రాహుల్ గాంధీ మాత్రం తెలంగాణ ప్రజలను ఏడిపిస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణకు ఎప్పుడు వచ్చిన సరే ఆయన ఇచ్చిన హామీలపై నిలదీస్తామని తెలంగణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. బడ్జెట్ లో తెలంగాణ ఉద్యమకారులను ఈ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని తెలంగణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. మహిళలకు రూ.2,500 ఇస్తామన్న స్కీం ఈసారి కూడా పత్తా లేదన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి గతేడాదితో పోల్చితే రూ.7 వేల కోట్లు కోత పెట్టారని అన్నారు. సింగరేణి, ట్రాన్స్, జెన్ కో లకు ఇవ్వాల్సిన 1.50 లక్షల కోట్లను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కొత్త ఉద్యోగాల నియామకాలకు ఎలాంటి కేటాయింపులు లేవని, ఉద్యోగులు, పెన్షనర్లకు బడ్జెట్ లో ఎలాంటి కొత్త కేటాయింపులు లేవన్నారు. కమీషన్లు వచ్చే యంగ్ ఇండియా స్కూళ్లకు మాత్రం రూ.5 వేల కోట్లు కేటాయించారని కానీ టీచర్ల రిక్రూట్ మెంట్ లేకుండా స్కూల్స్ నిర్మించి ఏం ప్రయోజనమని ప్రశ్నించారు. వరల్డ్ బ్యాంక్ ను మన భూములు ధారాదత్తం చేసే మూసీ ప్రాజెక్టుకు నిధులు కేటాయించారని అన్నారు. 3.24 లక్షల కోట్ల బడ్జెట్ లో క్యాపిటల్ ఎక్స్ పెండీచర్ కేవలం రూ.50 వేల కోట్లలోపేనని ఇలాగైనా సంపద సృష్టి ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. రెవెన్యూ సర్ ప్లస్, కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్లలో అంచనాలను పెంచి ప్రజలను మోసం చేశారని కవిత అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడం అన్నింటికి మించిన ఫేక్ అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. తెలంగాణ రైజింగ్ అంటూ ముఖ్యమంత్రి పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతుంటారని కానీ నిరుద్యోగంలో మనం రైజింగ్ అవుతున్నామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత చెప్పారు. స్టేట్ ఆఫ్ వర్కింగ్ అనే సర్వే సంస్థ చేసిన సర్వేలో తెలంగాణలో పెద్ద ఎత్తున నిరుద్యోగం ఉందని తేలిందని చెప్పారు. మహిళల విషయంలో 50 శాతం నిరుద్యోగిత రేటు ఉండటం ఆందోళన కలిగించే అంశమన్నారు. ఇక ఆహారం కల్తీ విషయంలోనూ ఈ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని మండిపడ్డారు. స్త్రీ నిధి విభాగంలో 14 ఏళ్లుగా ఓ దయ్యం ఉందని కవిత అన్నారు. జి. విద్యాసాగర్ రెడ్డి అనే వ్యక్తి గత బీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వాలను మేనేజ్ చేసి ఇప్పటికీ ఉద్యోగంలో కొనసాగుతున్నారన్నారు. అతను చేసే అక్రమాలపై విచారణ కమిషన్ వేసినప్పటికీ ఇప్పటికీ చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. వెంటనే మంత్రి సీతక్క ఎంక్వైరీ చేయించి విద్యాసాగర్ ను తొలగించాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత డిమాండ్ చేశారు.

**ఉద్యోగాల నియామకాలపై తప్పుడు ప్రచారం**

యంగ్ స్కిల్స్ యూనివర్సిటీ గురించి బడ్జెట్‌లో గొప్పలకు పోయారని.. ఆ సంస్థ వెబ్ సైట్ లో 64 వేల మంది ఎన్ రోల్ చేసుకున్నట్టుగా ఫేక్ ప్రచారం చేసుకుంటున్నారని.. వాస్తవానికి స్కిల్ యూనివర్సిటీలో ఎన్ రోల్ చేసుకున్నది 960 మంది మాత్రమే అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. వెంటనే యూనివర్సిటీ వెబ్ సైట్ లోని తప్పుడు సమాచారాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలపైనా కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేసుకుంటోందని మండిపడ్డారు. కేవలం 13 వేల ఉద్యోగాలు భర్తీ చేసి 60 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని చెప్పుకోవడం ఈ ప్రభుత్వానికే చెల్లిందన్నారు. తాము ప్రజా బడ్జెట్ లో లేవనెత్తిన కోట్లాది మంది ప్రజల ఆకాంక్షలు ఈ బడ్జెట్ లో ప్రతిఫలివంచలేదన్నారు. మైనార్టీలు, దివ్యాంగుల సంక్షేమానికి ఆశించిన స్థాయిలో కేటాయింపులు లేవన్నారు. బడ్జెట్ లో కేటాయింపులు చేయకున్నా, రివైజ్ఢ్ ఎస్టిమేట్స్ లో అవకాశం దక్కని రంగాలకు ప్రాధాన్యత ఇవ్వచ్చని ఆ దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత డిమాండ్ చేశారు.

# రోజాకు మదం తగ్గలేదు

**మాట జారితే తాట తీస్తాం.. ఏపీ మంత్రి సవిత ఫైర్**



పెనుగొండ, మార్చి 20 (ఈవార్తలు): వైసీపీ నాయకురాలు, మాజీ మంత్రి రోజాపై బీసీ సంక్షేమం, జౌళి, వస్త్ర పరిశ్రమల శాఖ మంత్రి ఎస్.సవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అధికారం కోల్పోయి, 2024 ఎన్నికల్లో నగరి ప్రజలు చెప్పుతో కొట్టినట్టు తీర్పు ఇచ్చినా రోజా తన తీరు మార్చుకోలేదని, ఇంకా అదే మదంతో మాట్లాడుతున్నారని ఆమె మండిపడ్డారు. ఇంట్లో ఖాళీగా కూర్చోలేక గాలి మాటలు మాట్లాడుతూ, అనవసర విమర్శలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ముఖ్యంగా నారా భువనేశ్వరి గారిపై నోరు జారితే తాట తీస్తామని తీవ్రంగా హెచ్చరించారు. వైఎస్ విజయమ్మ తన కుమారుడు జగన్‌కు రాసిన లేఖ నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే వైసీపీ అధిష్ఠానం రోజాను రంగంలోకి దింపిందని, ఆమె ఆ స్క్రిప్ట్ చదువుతున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ.. "ఓడిపోయాక రోజాకు బుద్ధి వచ్చిందనుకున్నాం. కానీ ఆమె ఇంకా నీచంగా మాట్లాడటమే తన అజెండాగా పెట్టుకున్నారు. అసలు నారా వారి కుటుంబం గురించి, భువనమ్మ గారి గురించి మాట్లాడే అర్హత రోజాకు ఉందా? మేం హిందువులమని నిరూపించుకోవడానికి మీలాగా ఇంట్లో సినిమా సెట్టింగులు వేసుకోవాల్సిన అవసరం లేదు. సీఎం చంద్రబాబు గారు తన జీవితకాలంలో కుటుంబ సమేతంగా ఎన్నోసార్లు తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ప్రభుత్వ లాంఛనాలతో పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ విషయాలు రోజాకు కనిపించవా?" అని ప్రశ్నించారు. ఐదేళ్ల పాలనలో జగన్ రెడ్డి ఏనాడైనా తన భార్య భారతితో కలిసి దేవాలయానికి వెళ్లి పట్టువస్త్రాలు సమర్పించారా అని, అందుకు సంబంధించిన ఆధారాలు ఉంటే చూపించాలని రోజాకు సవాల్ విసిరారు. "వైసీపీ పాలనలో హిందూ దేవాలయాలను, విగ్రహాలను ధ్వంసం చేశారు, రథాలను తగలబెట్టారు. ఇప్పుడు హిందూ సంప్రదాయాల గురించి నీతులు చెబుతుంటే నవ్వొస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకోబోతున్నారు. నిజంగా వెంకటేశ్వర స్వామిపై నమ్మకం, హిందూ ఆచారాలపై విశ్వాసం ఉంటే.. జగన్ రెడ్డి డిక్లరేషన్ ఇచ్చి, తన భార్యతో కలిసి స్వామివారిని దర్శించుకోవాలి. ఆ పని మీ జగన్ రెడ్డి చేయగలరా?" అని రోజాను నిలదీశారు. రాజకీయాలకు దూరంగా ఉంటూ, వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న భువనమ్మ గారిని తమ నీచ రాజకీయాల్లోకి లాగడం వైసీపీ దిగజారుడుతనానికి నిదర్శనమని సవిత అన్నారు. జగన్ రెడ్డి ముందు తన తల్లి విజయమ్మకు, చెల్లెళ్లు షర్మిల, సునీతలకు న్యాయం చేయాలని, లేదంటే సొంత కుటుంబానికే న్యాయం చేయలేని అసమర్థుడిగా చరిత్రలో మిగిలిపోతారని హితవు పలికారు. రోజా తన నోరు అదుపులో పెట్టుకుని, హుందాగా రాజకీయాలు చేయాలని మంత్రి సవిత హెచ్చరించారు.

# శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు బెస్ట్ ఎయిర్‌పోర్ట్ స్టాఫ్ అవార్డు

హైదరాబాద్, మార్చి 20 (ఈవార్తలు): తెలంగాణలోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌కు అంతర్జాతీయ పురస్కారం లభించింది. హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌గా పిలిచే రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి బెస్ట్ ఎయిర్‌పోర్ట్ స్టాఫ్ ఇన్ ఇండియా, సౌత్ ఏషియా -2026 అవార్డు దక్కింది. దక్షిణాసియాలోనే ఉత్తమ విమానాశ్రయ సిబ్బంది అవార్డులను శంషాబాద్ విమానాశ్రయం అందుకోవడం ఇది ఐదవసారి. మార్చి 19న, స్కైట్రాక్స్ వరల్డ్ ఎయిర్‌పోర్ట్ అవార్డుల కార్యక్రమంలో భాగంగా లండన్‌లో నిర్వహించిన ప్యాసింజర్ టెర్మినల్ ఎక్స్‌పో-2026 లో హైదరాబాద్ విమానాశ్రయానికి ఈ అవార్డులు లభించాయి. ప్రాంతీయ విమానాశ్రయాల విభాగంలో రెండో స్థానం, దక్షిణాసియాలో మూడో బెస్ట్ ఎయిర్‌పోర్ట్‌గా నిలిచింది. దీనితో పాటు ఆర్‌జీఐఏ విమానాశ్రయం "భారతదేశం, దక్షిణాసియాలోని ఉత్తమ ప్రాంతీయ విమానాశ్రయం" విభాగంలో రెండవ స్థానంలో, "భారతదేశం మరియు దక్షిణాసియాలోని ఉత్తమ విమానాశ్రయం" విభాగంలో మూడవ స్థానంలో నిలిచింది. ఇక "సంవత్సరానికి 20--30 మిలియన్ల ప్రయాణికులతో ఉత్తమ విమానాశ్రయం" విషయానికి వస్తే, ఇది ఎనిమిదవ స్థానాన్ని దక్కించుకుంది. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల నుంచి వచ్చే ప్రయాణికుల అభిప్రాయాలను సేకరించి, అత్యుత్తమ సేవలందించే విమానాశ్రయాలకు స్కైట్రాక్స్ ఈ పురస్కారాలను అందిస్తుంది. సిబ్బంది ప్రయాణికులతో వ్యవహరించే తీరు, వారి స్నేహపూర్వక వైఖరి, వృత్తిపరమైన సేవల ఆధారంగా ఈ ఎంపిక జరుగుతుంది. విమానాశ్రయంలో చెక్-ఇన్, సెక్యూరిటీ, ఇమ్మిగ్రేషన్, బోర్డింగ్ వంటి అన్ని విభాగాల్లో సిబ్బంది పనితీరును పరిగణనలోకి తీసుకుని అవార్డులు ప్రకటిస్తారు. ఈ అవార్డుతో పాటు శంషాబాద్ విమానాశ్రయం మరికొన్ని ఘనతలను కూడా సాధించింది. భారత్, దక్షిణాసియాలో 'రెండో ఉత్తమ ప్రాంతీయ విమానాశ్రయం'గా, గుర్తింపు పొందింది.

**స్కైట్రాక్స్ వరల్డ్ ఎయిర్‌పోర్ట్ అవార్డులలో రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం పొందిన పురస్కారాలు ఇవే!**

- **బెస్ట్ ఎయిర్‌పోర్ట్ స్టాఫ్ ఇన్ ఇండియా అండ్ సౌత్ ఆసియా 2026**
- **భారతదేశం, దక్షిణాసియాలో అత్యుత్తమ విమానాశ్రయ సిబ్బంది 2026**
- **భారతదేశం, దక్షిణాసియాలో 2వ అత్యుత్తమ ప్రాంతీయ విమానాశ్రయం 2026**
- **భారతదేశం, దక్షిణాసియాలో 3వ అత్యుత్తమ విమానాశ్రయం 2026**
- **8వ అత్యుత్తమ విమానాశ్రయం (20--30 ఎంపీపీఏ) 2026**

# ఇంటి పని చేయకపోతే క్రూరత్వం కాదు

**భార్య ఇంటి పనుల విషయంలో సుప్రీంకోర్టు**



న్యూఢిల్లీ: భార్య ఇంటి పని, వంట పని చేయనంత మాత్రాన అది క్రూరత్వం కిందకు రాదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. అంతేకాదు ఒక మహిళను పెళ్లి చేసుకునేది పనులు చేయడం కోసం మాత్రమే కాదని అభిప్రాయపడింది. జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ విక్రమ్ నాథ్ ఆధ్వర్యంలోని సుప్రీం ధర్మాసనం ఈ కేసును విచారించి, తాజా వ్యాఖ్యలు చేసింది. తన భార్య ఇంటి పనులు చేయడం లేదని, తనను, కుటుంబ సభ్యుల్ని చూసుకోవడంలో నిర్లక్ష్యం చేస్తోందని, ఈ నేపథ్యంలో ఆమె నుంచి విడాకులు కావాలని కోరుతూ ఒక వ్యక్తి ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించాడు. కేసు వివరాలకు సంబంధించి.. ఒక జంట 2017లో పెళ్లి చేసుకున్నారు. వారికి ఎనిమిదేళ్ల కుమారుడు కూడా ఉన్నాడు. పెళ్లైన వారం తర్వాత నుంచి భార్య ప్రవర్తనలో మార్పు వచ్చిందని భర్త ఆరోపించాడు. తనను సరిగ్గా చూసుకోవడం లేదని, వంట చేయడం లేదని ఆరోపించాడు. అలాగే, తన తల్లిదండ్రుల్ని కూడా అసభ్య పదజాలంతో తిడుతోందన్నాడు. తనకు కొడుకు పుట్టినా, నామకరణానికి కూడా తనను, కుటుంబ సభ్యుల్ని ఆహ్వానించలేదని కోర్టుకు తెలిపాడు. అందువల్ల ఆమె నుంచి విడాకులు కావాలని కోరాడు. దీనిపై భార్య స్పందించింది. తను ప్రెగ్నెన్సీ సమయంలో భర్త, అత్తవారింటి అనుమతితోనే డెలివరీకి పుట్టింటికి వెళ్లానని, నామకరణానికి పిలిచినా వాళ్లు రాలేదని తెలిపింది. నగలు, డబ్బు కావాలని డిమాండ్ చేసినట్లు తెలిపింది. ఇరువురి వాదనలు విన్న ఫ్యామిలీ కోర్టు మధ్యవర్తిత్వానికి ఆదేశించింది. ఇరువురికి నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా సాధ్యం కాలేదు. దీంతో భర్త విజ్ఞప్తి మేరకు ఇరువురికి ఫ్యామిలీ కోర్టు విడాకులు మంజూరు చేసింది. కానీ, ఫ్యామిలీ కోర్టు ఇచ్చిన విడాకుల్ని సవాలు చేస్తూ భార్య హైకోర్టును ఆశ్రయించింది. విచారణ జరిపిన హైకోర్టు.. ఫ్యామిలీ కోర్టు ఇచ్చిన విడాకులపై స్టే విధించింది. దీంతో భర్త హైకోర్టు ఆదేశాల్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై సుప్రీంలో వాదనలు జరిగాయి. తను పెళ్లి చేసుకుంది పని మనిషిని కాదని, జీవిత భాగస్వామిని అనే విషయం గుర్తు పెట్టుకోవాలని భర్తకు సూచించింది. భార్య ఇంటి పనులు చేయనంత మాత్రాన క్రూరత్వంగా భావించలేమని తెలిపింది. అంతేకాదు.. ఇది పాత కాలం కాదని, కొత్త తరం అని, అందువల్ల భర్తలు కూడా వంట చేయడం, బట్టలు ఉతకడంలో సాయపడాలని సూచించింది. తదుపరి విచారణ సందర్భంగా ఇరువురూ వ్యక్తిగతంగా కోర్టుకు హాజరుకావాలని ఆదేశించింది.

## ఎస్బీఐకి రూ.6,337 కోట్ల పన్ను నోటీసులు

ముంబై: ప్రభుత్వ రంగ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) భారీ పన్ను నోటీసులను అందుకుంది. 2023-24 అసెస్‌మెంట్ ఏడాదికి సంబంధించి రూ. 6,337 కోట్ల(వడ్డీతో సహా) పన్ను చెల్లించాలని ఆదాయపు పన్ను శాఖ నుంచి నోటీసులు అందుకున్నట్టు బ్యాంకు రెగ్యులేటరీ ఫైలింగ్‌లో పేర్కొంది. అయితే, ఈ ఉత్తర్వులను సవాలు చేస్తామని ఎస్‌బీఐ స్పష్టం చేసింది. బ్యాంకు తన పన్ను పరిధిలోకి వచ్చే ఆదాయాన్ని తక్కువగా చూపించిందని ఆదాయపు పన్ను శాఖ అభిప్రాయ పడింది. అయితే, పన్ను నిబంధనల ప్రకారమే మినహాయింపులు లెక్కించినట్టు ఎస్‌బీఐ చెబుతోంది. వివిధ కారణాలపై అసెస్‌మెంట్ యూనిట్ చేసిన తిరస్కరణల కారణంగా ఈ పన్ను డిమాండ్ తలెత్తింది. నిర్ణీత కాలవ్యవధిలోగా అప్పీలేట్ అధికారుల ముందు అప్పీల్ దాఖలు చేయడంతో సహా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపింది. ఈ ఉత్తర్వుల కారణంగా బ్యాంకు కార్యకలాపాలపై గానీ, ఇతర సేవలపై గానీ ఎలాంటి ప్రభావం ఉండవని ఎస్‌బీఐ పేర్కొంది.

## భర్తను చంపిన కొడుకు

**జీవితఖైదు పడేలా చేసిన తల్లి**

బరేలీ: ఉత్తరప్రదేశ్‌లోని బరేలీలో జరిగిన ఒక హత్య కేసులో, తల్లి ఇచ్చిన సాక్ష్యం ఆధారంగా ఆమె కొడుకుకు కింది కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. భూమి విషయంలో జరిగిన గొడవ కారణంగా ఛత్రపాల్ అనే నిందితుడు గత సంవత్సరం ఏప్రిల్ 11న తన తండ్రిపై కొడవలితో దాడి చేశాడు. అతనిని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మరణించాడు. ఈ కేసులో తల్లి సాక్ష్యం చెప్పగా, కొడుకుకు శిక్ష పడింది. ఈ హత్య కేసు విచారణ సమయంలో నిందితుడైన ఛత్రపాల్ తల్లి, సోదరుడితో సహా ఏడుగురు సాక్షులను ప్రాసిక్యూషన్ తరఫున కోర్టులో ప్రవేశపెట్టారు. తన భర్త హత్య కేసులో ఆ మహిళ తన కుమారుడికి వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పింది. తన భర్తను చంపింది కుమారుడేనని చెప్పింది. కుమారుడి ముఖాన్ని కూడా చూడాలనుకోవడం లేదని కోర్టులో పేర్కొంది. ఆధారాలు, సాక్ష్యాలను పరిశీలించిన ట్రయల్ కోర్టు నిందితుడు ఛత్రపాల్‌కు జీవిత ఖైదుతో పాటు లక్ష రూపాయల జరిమానా విధించింది. నేర నిర్ధారణ కావడంలో తల్లి సాక్ష్యం కీలకంగా మారినట్లు తెలిపింది.

## ఫోన్ నంబర్ లేకుండానే చాటింగ్

న్యూఢిల్లీ : వినియోగదారులకు మరింత గోప్యతనిచ్చే విధంగా మెటా సంస్థ వాట్సాప్‌ను తీర్చిదిద్దుతున్నది. తమ ఫోన్ నంబర్‌ను అవతలి వారికి తెలుపకుండానే వారితో చాటింగ్ చేసే సదుపాయాన్ని తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నది. ఈ సదుపాయాన్ని మరో రెండు నెలల్లో అందుబాటులోకి తేనున్నట్టు ఓ ఆంగ్ల దినపత్రిక వెల్లడించింది. ప్రస్తుతం ఫోన్ నంబర్‌తో వాట్సాప్‌నకు లాగిన్ అవుతున్న వినియోగదారులకు ప్రత్యేకమైన యూజర్‌నేమ్ ఇస్తారు. దానితో అవతలి వారికి సందేశాలు పంపడంతోపాటు చాటింగ్ చేయవచ్చు, వాయిస్, వీడియో కాల్స్ కూడా చేయవచ్చని ఆ వార్తా కథనం పేర్కొన్నది. దీంతో వినియోగదారులకు మరింత గోప్యత లభిస్తుందని తెలిపింది.

# 300 యాప్‌లు, వెబ్‌సైట్లపై వేటు

న్యూఢిల్లీ: ఆన్‌లైన్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్ యాప్‌లపై కేంద్ర ప్రభుత్వం తన ఉక్కుపాదాన్ని కొనసాగిస్తోంది. దేశవ్యాప్తంగా అక్రమంగా కార్యకలాపాలు సాగిస్తున్న మరో 300 గ్యాంబ్లింగ్, బెట్టింగ్ వెబ్‌సైట్లు, యాప్‌లను తాజాగా బ్లాక్ చేసింది. దీంతో ఇప్పటివరకు బ్లాక్ చేసిన వాటి సంఖ్య 8,400కు చేరిందని ప్రభుత్వ వర్గాలు శుక్రవారం వెల్లడించాయి. బ్లాక్ చేసిన వాటిలో ఆన్‌లైన్ స్పోర్ట్స్ బెట్టింగ్ ప్లాట్‌ఫామ్‌లు, రౌలెట్, స్లాట్స్ వంటివి అందించే ఆన్‌లైన్ క్యాసినోలు, బెట్టింగ్ ఎక్స్ఛేంజ్‌లు ఉన్నాయి. వీటితో పాటు సట్టా/మట్కా నెట్‌వర్క్‌లు, నిజమైన డబ్బుతో ఆడే కార్డ్ గేమ్ యాప్‌లు కూడా ఈ జాబితాలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. గతేడాది ఆగస్టులో పార్లమెంట్ ఆమోదించిన 'ఆన్‌లైన్ గేమింగ్ ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ యాక్ట్, 2025' కింద ఈ చర్యలు తీసుకుంటున్నారు. 2025 అక్టోబర్ 1 నుంచి అమల్లోకి వచ్చిన ఈ కొత్త చట్టం తర్వాతే సుమారు 4,900 వెబ్‌సైట్లను బ్లాక్ చేయడం గమనార్హం. ఈ చట్టం ప్రకారం... పోకర్, రమ్మీ, ఫాంటసీ స్పోర్ట్స్ వంటి నిజమైన డబ్బుతో కూడిన గేమ్‌లను అందిస్తే మూడేళ్ల వరకు జైలు శిక్ష, భారీ జరిమానాలు విధిస్తారు. ఈ పరిశ్రమను నియంత్రించేందుకు 'ఆన్‌లైన్ గేమింగ్ అథారిటీ ఆఫ్ ఇండియా'ను కూడా ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్ మనీ గేమింగ్ ప్లాట్‌ఫామ్‌ల వల్ల ఎన్నో కుటుంబాలు ఆర్థికంగా చితికిపోవడం, యువత వ్యసనాలకు బానిసలు కావడం, కొన్ని సందర్భాల్లో ఆత్మహత్యలకు పాల్పడటం వంటి ఘటనల నేపథ్యంలో ప్రభుత్వం ఈ కఠిన చర్యలు చేపట్టింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) కూడా 'గేమింగ్ డిజార్డర్'ను ఒక ఆరోగ్య సమస్యగా గుర్తించింది. అయితే, ఈ చట్టం అన్ని ఆన్‌లైన్ గేమ్‌లను వ్యతిరేకించడం లేదు. ఈ-స్పోర్ట్స్, సురక్షితమైన సోషల్, ఎడ్యుకేషనల్ గేమ్‌లను ప్రోత్సహిస్తోంది. లాభాల ఆశ చూపి వినియోగదారులను దోపిడీ చేసే బెట్టింగ్, గ్యాంబ్లింగ్ గేమ్‌లకు, నైపుణ్యాన్ని పెంచే గేమ్‌లకు మధ్య స్పష్టమైన తేడాను ఈ చట్టం చూపిస్తోంది.




# బెంగళూరులో ఇంటి ఓనర్ల దోపిడీ

**రూ.70 వేల డిపాజిట్‌లో రూ.52 వేలు కట్**



బెంగళూరు: టెక్ హబ్ బెంగళూరులో ఇంటి యజమానుల ఆగడాలు మరోసారి వెలుగులోకి వచ్చాయి. అద్దెకు ఉంటున్న ఒక యువతి సెక్యూరిటీ డిపాజిట్ నుంచి ఏకంగా రూ.52,000 అన్యాయంగా కట్ చేసుకున్నారని ఆరోపిస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన వీడియో ప్రస్తుతం తీవ్ర దుమారం రేపుతోంది. యశవంత్‌పూర్‌లోని 'ఆర్గే అర్బన్ బ్లూమ్' అపార్ట్‌మెంట్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. బాధితురాలు ఒక 3బీహెచ్‌కే ఫ్లాట్‌లో అద్దెకు దిగేటప్పుడు ఇంటి యజమానులైన వీరేంద్ర పి. ఖట్వకర్, రేఖా వి. ఖట్వకర్‌లకు రూ.70,000 సెక్యూరిటీ డిపాజిట్‌గా చెల్లించింది. ఇటీవల యజమానులు ఆ ఫ్లాట్‌ను అమ్మకానికి పెట్టడంతో ఆమెను ఇల్లు ఖాళీ చేయమని కోరారు. ఒప్పందం ప్రకారం ఆమె ఫ్లాట్ ఖాళీ చేసిన తర్వాత, యజమానులు కేవలం రూ.18,000 మాత్రమే తిరిగి ఇచ్చారు. మిగిలిన రూ.52,000కు ఎలాంటి సరైన లెక్కలు చూపకుండా కోత విధించారని ఆమె ఆరోపిస్తోంది. ఈ అన్యాయంపై ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక వీడియో షేర్ చేసి తన ఆవేదనను వ్యక్తం చేసింది. ఇంటి యజమానుల తీరును వివరిస్తూ, తనలా మరెవరూ మోసపోకూడదని పేర్కొంది. ఈ వీడియోకు అనూహ్య స్పందన లభించింది. ఇప్పటివరకు 7.3 లక్షల మందికి పైగా వీక్షించగా, వేల సంఖ్యలో నెటిజన్లు ఆమెకు మద్దతుగా నిలుస్తున్నారు. బెంగళూరు సిటీ పోలీస్, ఉన్నతాధికారులను ట్యాగ్ చేస్తూ, ఈ విషయంపై విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని ఆమె కోరింది. బెంగళూరులో అద్దెకు ఉంటున్న వారికి ఇలాంటి అనుభవాలు కొత్తేమీ కాదు. పెయింటింగ్, డీప్ క్లీనింగ్, పాత మరమ్మతుల పేరుతో యజమానులు డిపాజిట్ నుంచి భారీ మొత్తంలో డబ్బులు కట్ చేయడం సర్వసాధారణంగా మారింది. కర్ణాటక రెంట్ కంట్రోల్ యాక్ట్ ప్రకారం డిపాజిట్‌పై పరిమితులు ఉన్నప్పటికీ, వాటి అమలు సరిగా లేకపోవడంతో యజమానుల ఇష్టారాజ్యంగా నడుస్తోందని పలువురు వాపోతున్నారు. ఈ ఘటనతో అద్దెదారుల హక్కులు, యజమానుల బాధ్యతలపై సోషల్ మీడియాలో మరోసారి పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఇలాంటి మోసాల బారిన పడకుండా ఉండాలంటే పక్కా రెంటల్ అగ్రిమెంట్ చేసుకోవడంతో పాటు, ఇంట్లోకి మారేటప్పుడు, ఖాళీ చేసేటప్పుడు ఫోటోలు, వీడియోలు తీసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

## సర్‌ప్రైజ్ అన్నాడు.. చచ్చాడు!

**ఇరాన్ సైనికాధికారి మృతి**



టెహ్రాన్: అమెరికా-ఇజ్రాయెల్‌తో జరుగుతోన్న యుద్ధంలో ఇరాన్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఇజ్రాయెల్ దాడుల్లో కీలక సైనికాధికారి, ఐఆర్‌జీసీ ప్రతినిధి జనరల్ అలీ మహమ్మద్ నయినీ మృతి చెందారు. శత్రు దేశాన్ని హెచ్చరించిన కొన్ని గంటల్లోనే ఆయన చనిపోవడం గమనార్హం. ఈ మృతిని ఐఆర్‌జీసీ ధ్రువీకరించింది. నయినీ మరణించడానికి కొన్ని గంటల ముందు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహును ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు. యురేనియం శుద్ధి చేయడం, బాలిస్టిక్ క్షిపణులు తయారుచేసే సామర్థ్యం ఇక ఇరాన్‌కు లేదని నెతన్యాహు అనగా.. "ఇజ్రాయెల్, అమెరికాతో యుద్ధం జరుగుతున్నప్పటికీ.. మా క్షిపణి పరిశ్రమ ఇప్పుడు అత్యున్నత స్థాయికి చేరుకుంది. ఈ ఘర్షణల్లో కూడా మేం ఉత్పత్తిని కొనసాగిస్తున్నాం. మావద్ద చాలినన్ని నిల్వలు ఉన్నాయి. ఈ విషయంలో మాకు ఎలాంటి ఆందోళనా లేదు. మా శత్రువుకు సర్‌ప్రైజ్‌లు ఎదురుకానున్నాయి. యుద్ధం కొనసాగేకొద్దీ అవి మరింత తీవ్రంకానున్నాయి" అంటూ నయినీ కౌంటర్ ఇచ్చారు. అలాగే ఇరాన్ నౌకాదళం ధ్వంసం అయిందంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనను తోసిపుచ్చారు. పర్షియన్ గల్ఫ్‌లోకి అమెరికా తన నౌకలను పంపాలంటూ సవాలు విసిరారు. ఇలా ఆయన హెచ్చరించిన కొద్ది గంటల్లోనే ఇజ్రాయెల్ దాడుల్లో ప్రాణాలు కోల్పోయారు. ఈ వారంలో ఇప్పటికే ఇరాన్ అత్యున్నత సైనికాధికారి అలీ లారిజానీ, ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ అనుబంధ బసీజ్ మిలీషియా అధిపతి జనరల్ గులాం రెజా సాల్మనీ మరణించిన సంగతి తెలిసిందే.

## యుద్ధాన్ని భారతే ఆపగలదు



న్యూఢిల్లీ: ప్రస్తుతం జరుగుతున్న యుద్ధాన్ని ఆపగల సత్తా ఒక్క భారత్‌కే ఉందని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్ఎస్) చీఫ్ మోహన్ భగవత్ అన్నారు. నాగ్‌పూర్‌లో శుక్రవారం జరిగిన విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) విదర్భ ప్రాంత కార్యాలయ భవన నిర్మాణ భూమి పూజ కార్యక్రమంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలో పెరుగుతున్న అస్థిరత, ఘర్షణల నేపథ్యంలో శాంతి కోసం ప్రపంచ దేశాలు భారత్ వైపు చూస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం అంతర్జాతీయ వ్యవహారాల్లో 'బలవంతుడిదే రాజ్యం' అనే నీతి నడుస్తోందని, ఇది భారతీయ విలువలైన మానవతా ధర్మానికి పూర్తి విరుద్ధమని భగవత్ విమర్శించారు. ధర్మ పునాదులతో ప్రపంచంలో సమతుల్యతను పునరుద్ధరించే బాధ్యత భారత్‌పై ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా మధ్యప్రాచ్యంలో శాంతిని నెలకొల్పే సామర్థ్యం భారత్‌కు మాత్రమే ఉందని ఇప్పుడు ప్రపంచం గుర్తిస్తోందని తెలిపారు. గత 2,000 ఏళ్లుగా అనేక సిద్ధాంతాలు ప్రపంచానికి శాశ్వత శాంతిని అందించడంలో విఫలమయ్యాయని, ఎందుకంటే వాటిలో ఐక్యతా భావన లోపించిందని భగవత్ విశ్లేషించారు. స్వార్థ ప్రయోజనాలు, ఆధిపత్య కాంక్షే ఆధునిక ఘర్షణలకు ప్రధాన కారణాలని ఆయన పేర్కొన్నారు. అంతర్జాతీయ పాత్ర పోషించడానికి ముందు దేశం అంతర్గతంగా బలంగా మారాలని భగవత్ పిలుపునిచ్చారు. "సత్యం మన వైపు ఉన్నా, మనం బలహీనంగా ఉంటే ప్రపంచం మనల్ని గౌరవించదు" అని ఆయన స్పష్టం చేశారు. దేశంలోని అంతర్గత విభేదాలను తొలగించుకుని, సమాజం ఐక్యంగా మారాలన్నారు. ప్రపంచంలో సామరస్యాన్ని వ్యాప్తి చేసే తన కర్తవ్యాన్ని నెరవేర్చడానికి భారత్ సిద్ధమైనప్పుడు, దేశ ఆర్థిక, భౌతిక పురోగతి దానంతట అదే సాధ్యమవుతుందని భగవత్ ఉద్ఘాటించారు.

## ఆకర్షణే మంత్రంగా మమత బడ్జెట్

**ప్రజలను ఆకట్టుకునే దిశగా 10 హామీలు**



కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల సమరం క్లైమాక్స్‌కు చేరుకుంది. మరోసారి అధికార పీఠాన్ని దక్కించుకోవడమే లక్ష్యంగా తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అధినేత్రి మమతా బెనర్జీ నేడు తన పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేశారు. కేవలం హామీలు మాత్రమే కాకుండా, కేంద్రాన్ని నిలదీస్తూ వ్యాఖ్యలు చేశారు. మేనిఫెస్టో విడుదల అనంతరం మమత కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఎన్నికల తర్వాత ఎన్ఆర్‌సీ, జనగణన పేరుతో పౌరసత్వాన్ని తొలగించేందుకు కేంద్రం కుట్ర చేస్తోందని ఆమె ఆరోపించారు. నియోజకవర్గాల పునర్విభజన ద్వారా బీజేపీకి లబ్ధి చేకూర్చేందుకు ఎన్నికల కమిషన్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో అనధికార రాష్ట్రపతి పాలన నడుస్తోందని... బెంగాల్ అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి అందరూ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

**దీదీ ప్రకటించిన 10 హామీలు:**

- లక్ష్మీ భండార్ పెంపు: జనరల్ కేటగిరీ మహిళలకు నెలకు రూ. 1,500, ఎస్సీ/ఎస్టీ మహిళలకు రూ. 1,700 ఆర్థిక సాయం.
- యువతకు అండ: 'బంగ్లార్ యువశక్తి' కింద నిరుద్యోగ యువతకు నెలకు రూ. 1,500 భృతి.
- వ్యవసాయ బడ్జెట్: రైతుల కోసం రూ. 30,000 కోట్లతో ప్రత్యేక అగ్రికల్చర్ బడ్జెట్.
- ద్వారే చికిత్స: ప్రతి బ్లాక్‌లోనూ ఇంటి వద్దకే వైద్య సేవలు అందించేలా మెడికల్ క్యాంపులు.
- ఆధునిక విద్య: 'బంగ్లార్ శిక్షాయతన్' కింద ప్రభుత్వ పాఠశాలల ఆధునికీకరణ.
- సొంతింటి కల: ప్రతి పేద కుటుంబానికి శాశ్వత గృహ నిర్మాణం.
- తాగునీరు: ప్రతి ఇంటికీ పైపుల ద్వారా శుద్ధి చేసిన తాగునీటి సరఫరా.
- వృద్ధాప్య పింఛన్: అర్హులైన వృద్ధులందరికీ నిరంతరాయంగా పెన్షన్ అందేలా చర్యలు.
- పరిపాలన సౌలభ్యం: కొత్తగా 7 జిల్లాలు, మరిన్ని మున్సిపాలిటీల ఏర్పాటు.
- గ్లోబల్ ట్రేడ్ సెంటర్: బెంగాల్‌ను పెట్టుబడుల హబ్‌గా మార్చేందుకు ప్రపంచ స్థాయి లాజిస్టిక్స్ అభివృద్ధి.

## యుద్ధ రంగంలో కిమ్ కూతురు

ప్యాంగ్యాంగ్: ఉత్తరకొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ టీనేజ్ కూతురు, తన తండ్రి పర్యవేక్షణలో జరిగిన సైనిక శిక్షణలో భాగంగా ఒక యుద్ధ ట్యాంకును నడిపింది. ఈ తండ్రీకూతుళ్ల తాజా బహిరంగ ప్రదర్శన, ఆ అమ్మాయిని కిమ్ వారసురాలిగా తీర్చిదిద్దుతున్నారనే ఊహాగానాలకు మరింత బలం చేకూర్చింది. ఇటీవల ఫైరింగ్ రేంజ్‌లో రైఫిల్‌తో ఆ అమ్మాయి కనిపించింది. మరోచోట హ్యాండ్ గన్‌తో షూటింగ్ చేస్తున్న చిత్రాలు బయటకు వచ్చాయి. తాజాగా, కుమార్తె యుద్ధ ట్యాంకును నడుపుతుండగా, కిమ్ జాంగ్ ఉన్ ఆమె పక్కనే కూర్చున్నారు. ఆ ట్యాంకర్‌పై మరికొంతమంది సైనిక అధికారులు కూడా ఉన్నారు. ఇందుకు సంబంధించిన ఫొటోను ఉత్తరకొరియా అధికారిక మీడియా కేసీఎన్ఏ విడుదల చేసింది. గత కొన్నాళ్లుగా కిమ్ పక్కనే తరచూ కుమార్తె కనిపిస్తున్నారు. ఉత్తరకొరియా సైనిక దళంలోకి కొత్త యుద్ధ ట్యాంక్‌లు వచ్చాయి. గురువారం ఆ ట్యాంక్‌లను కిమ్ పరిశీలించారు. డ్రోన్లు, యాంటీ ట్యాంక్ మిస్సైళ్లను ఆ ట్యాంక్‌తో పేల్చవచ్చు.

## జొమాటోలో పెరిగిన ప్లాట్‌ఫామ్ ఫీజు

ముంబై: ప్రముఖ ఫుడ్ డెలివరీ సంస్థ జొమాటో తన యూజర్లపై మరోసారి భారం మోపింది. ప్రతి ఆర్డర్‌పై వసూలు చేసే ప్లాట్‌ఫామ్ ఫీజును 19.2 శాతం పెంచింది. ఈ కొత్త పెంపుతో ఒక్కో ఆర్డర్‌పై ఛార్జీ రూ. 2.40 పెరిగింది. శుక్రవారం నుంచి జొమాటో యాప్‌లో ఈ మార్పులు కనిపించాయి. తాజా పెంపుతో జీఎస్టీకి ముందు ప్లాట్‌ఫామ్ ఫీజు రూ. 12.50 నుంచి రూ. 14.90కి చేరింది. పెరిగిన ఎల్పీజీ, ముడిచమురు ధరల కారణంగా రెస్టారెంట్లు, డెలివరీ పార్ట్‌నర్ల నిర్వహణ వ్యయాలు పెరిగాయి. ఈ నేపథ్యంలోనే మార్జిన్లు, యూనిట్ ఎకనామిక్స్‌ను మెరుగుపరచుకోవడానికి కంపెనీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. జొమాటో 2023 ఆగస్టులో తొలిసారి ఆర్డర్‌పై రూ. 2 ప్లాట్‌ఫామ్ ఫీజును ప్రవేశపెట్టింది. అప్పటి నుంచి దశలవారీగా పెంచుతూ వస్తోంది. గతేడాది సెప్టెంబర్ 2025లో చివరిసారిగా ఫీజును సవరించింది. అంతకుముందు ఫిబ్రవరిలో పండుగల సీజన్‌లో ఫీజును రూ. 6 నుంచి రూ. 10కి పెంచింది. జొమాటోకు పోటీగా ఉన్న స్విగ్గీ ప్రస్తుతం పన్నులతో కలిపి ప్రతి ఆర్డర్‌పై రూ. 14.99 ప్లాట్‌ఫామ్ ఫీజు వసూలు చేస్తోంది.

## పవర్ పెట్రోల్ ధర పెంపు

**ఇండస్ట్రియల్ డీజిల్ ధర కూడా**

**లీటర్ పై ఏకంగా రూ.22 పెంపు**

న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు దేశీయ ఇంధన ధరలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ఇరాన్, ఇజ్రాయెల్-అమెరికా మధ్య యుద్ధ వాతావరణం కారణంగా క్రూడ్ ఆయిల్ ధరలు భగ్గుమనడంతో, చమురు మార్కెటింగ్ కంపెనీలు ధరలను భారీగా పెంచాయి. ముఖ్యంగా పరిశ్రమల్లో వాడే బల్క్ డీజిల్ (ఇండస్ట్రియల్ డీజిల్) ధరను లీటరుకు ఏకంగా రూ.22.03 పెంచుతూ నిర్ణయం తీసుకున్నాయి. శుక్రవారం నుంచి ఈ కొత్త ధరలు అమలులోకి వచ్చాయి. ఈ పెంపుతో లీటరు ఇండస్ట్రియల్ డీజిల్ ధర రూ.87.57 నుంచి రూ.109.59కి చేరింది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) కూడా తన ధరలను సవరించింది. సాధారణ వాహనాల్లో కాకుండా ఫ్యాక్టరీలు, షాపింగ్ మాల్స్, నిర్మాణ రంగంలోని భారీ యంత్రాలు, జనరేటర్లలో ఈ ఇండస్ట్రియల్ డీజిల్‌ను వినియోగిస్తారు. దీని ధర పెరగడం వల్ల పరిశ్రమల ఉత్పత్తి వ్యయం గణనీయంగా పెరుగుతుంది. ఈ భారం పరోక్షంగా రవాణా, ఇతర వ్యాపార కార్యకలాపాలపై పడి చివరికి నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు దారితీస్తుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, స్పీడ్, పవర్ వంటి ప్రీమియం పెట్రోల్ రకాల ధరలను కూడా లీటరుకు రూ.2.09 మేర పెంచారు. ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో ముడి చమురు ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని, ఇది దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపవచ్చని అంచనా వేస్తున్నారు.

## యుద్ధ విమానాలకు 'నో' ల్యాండింగ్

**ఒత్తిళ్లకు తలొగ్గబోమన్న శ్రీలంక.. అమెరికా విజ్ఞప్తి తిరస్కరణ**

కొలంబో: పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో అగ్రరాజ్యం అమెరికా చేసిన ఓ విజ్ఞప్తిని శ్రీలంక తిరస్కరించింది. మార్చి నెల ఆరంభంలో రెండు యుద్ధ విమానాలను మట్టాలా అంతర్జాతీయ విమానాశ్రయంలో ల్యాండింగ్ కోసం అమెరికా అనుమతి కోరగా.. అందుకు నిరాకరించింది. ఈ విషయాన్ని శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకే (ూఅబతీు ఖబఝౌతీు ఐఅంయిఖఝఖఝఎవ) పార్లమెంటులో వెల్లడించారు. ఎర్ర సముద్రం, ఏడెన్ గల్ఫ్ మధ్య ఓ కీలక సముద్ర మార్గంగా ఉన్న జిబౌటీ స్థావరంలోని అమెరికా యుద్ధ విమానాల నుంచి రెండుసార్లు అభ్యర్థనలు వచ్చాయన్నారు. ఈ స్థావరం నుంచి మార్చి 4, 8 తేదీల్లో పలు నౌకా విధ్వంసక మిసైల్స్‌తో కూడిన యుద్ధ విమానాల ల్యాండింగ్ కోసం అడిగితే.. తాము వద్దని చెప్పామన్నారు. అమెరికా- ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య కొనసాగుతోన్న యుద్ధం వేళ వస్తోన్న ఒత్తిళ్ల నడుమ శ్రీలంక తటస్థ వైఖరిని కొనసాగించేందుకు కట్టుబడి ఉందని దిసనాయకే స్పష్టం చేశారు. ఎన్ని ఒత్తిళ్లు ఉన్నా సరే తాము తటస్థ వైఖరినే కొనసాగించాలనుకుంటున్నామన్నారు. ఈ యుద్ధం సవాళ్లను విసురుతోందన్న ఆయన.. ఒత్తిళ్లకు శ్రీలంక తలొగ్గదని, తటస్థంగా ఉండేందుకు సాధ్యమైనదంతా చేస్తామని తెలిపారు.

# 9 గంటలు గాల్లోనే ఎయిరిండియా విమానం




న్యూఢిల్లీ: ఎయిరిండియా విమాన ప్రయాణికులకు ఓ వింత అనుభవం ఎదురైంది. ఢిల్లీ నుంచి కెనడాలోని వాంకోవర్‌కు బయల్దేరిన విమానం, గాల్లో ఏకంగా 9 గంటల పాటు ప్రయాణించి మళ్లీ వెనక్కి ఢిల్లీలోనే ల్యాండ్ అయింది. కెనడా మార్గంలో ప్రయాణానికి అనుమతి లేని బోయింగ్ విమానాన్ని ఈ సర్వీసుకు ఉపయోగించడమే ఈ గందరగోళానికి కారణమైంది. వివరాల్లోకి వెళితే, ఎయిరిండియాకు చెందిన ఏఐ185 విమానం గురువారం మధ్యాహ్నం 12:18 గంటలకు ప్రయాణికులతో ఢిల్లీ నుంచి వాంకోవర్‌కు బయల్దేరింది. వాస్తవానికి ఈ మార్గంలో బోయింగ్ 777-300ఈఆర్ విమానాలకు మాత్రమే కెనడా అధికారులు అనుమతి ఇచ్చారు. కానీ, ఎయిరిండియా పొరపాటున బోయింగ్ 777-200ఎల్ఆర్ విమానాన్ని పంపింది. విమానం బయల్దేరిన నాలుగు గంటల తర్వాత చైనా గగనతలంలోకి ప్రవేశించాక ఈ పొరపాటును గుర్తించారు. దీంతో పైలట్లు వెంటనే విమానాన్ని వెనక్కి మళ్లించి, ఢిల్లీకి సురక్షితంగా తీసుకువచ్చారు. ఈ ఘటనపై ఎయిరిండియా ప్రతినిధి స్పందించారు. "ఆపరేషనల్ సమస్య కారణంగా ఏఐ185 విమానం ఢిల్లీకి తిరిగి వచ్చింది. ప్రయాణికులు, సిబ్బంది అందరూ సురక్షితంగా దిగారు. వారికి కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నాం. ప్రయాణికులకు హోటల్ వసతి కల్పించి, వీలైనంత త్వరగా వారి గమ్యస్థానాలకు చేర్చేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. మరుసటి రోజు ఉదయం ప్రయాణికులతో విమానం వాంకోవర్‌కు బయల్దేరింది" అని వివరించారు. ఎయిరిండియా గతంలోనూ ఇలాంటి నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడిన సందర్భాలున్నాయి. 2025 నవంబర్‌లో సరైన ఎయిర్‌వర్తీనెస్ రివ్యూ సర్టిఫికెట్ (ఏఆర్సీ) లేకుండానే ఎనిమిది వాణిజ్య విమానాలను నడిపినందుకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) ఎయిరిండియాకు రూ.1 కోటి జరిమానా విధించిన విషయం తెలిసిందే.

వయ్యారి చిత్రం


తమన్నా



## చిన్నారికి విరోష్ జంట విందు!

టాలీవుడ్ మోస్ట్ క్రేజీ కపుల్ విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న పెళ్లి పీటలెక్కిన సంగతి తెలిసిందే. అయితే, తమను పెళ్లికి పిలవలేదని ఓ చిన్నారి అభిమాని సోషల్ మీడియాలో అలిగిన వీడియో నెట్టింట వైరల్ అయ్యింది. ఆ బుజ్జి తల్లి ఆవేదన చూసి చలించిపోయిన 'విరోష్' జంట, స్వయంగా ఆ పాపను తమ ఇంటికి పిలిచి ఆతిథ్యం ఇచ్చారు. విజయ్ భోజనం వడ్డించగా, రష్మిక లడ్డూలు తినిపించి ఆ చిన్నారి అలక తీర్చిన తీరు ఇప్పుడు అందరినీ ఆకట్టుకుంటోంది. ఆ చిన్నారి ఇంటికి రాగానే రష్మిక ఎంతో ఆత్మీయంగా హత్తుకుని, తన పక్కనే కూర్చోబెట్టుకుని ముచ్చట్లు చెప్పడం విశేషం. చిన్నారి అలక తీర్చేందుకు విజయ్, రష్మికలు స్వయంగా రంగంలోకి దిగారు. విజయ్ దేవరకొండ ఆ పాపకు భోజనం వడ్డిస్తుండగా, రష్మిక దగ్గరుండి లడ్డూలు పెట్టింది. విజయ్ ఆ పాపను ఎత్తుకుని, 'వీడియోలో అడిగావు కదా లడ్డూ ఇవ్వలేదని.. ఇప్పుడు ఇచ్చామా లేదా?' అని సరదాగా అడిగారు. దానికి ఆ పాప ఎంతో క్యూట్‌గా సమాధానం చెప్పడం అక్కడ ఉన్నవారిని నవ్వించింది. ఆ చిన్నారికి పెళ్లికి రాలేకపోయానన్న బాధ పోయి, తన అభిమాన హీరో హీరోయిన్లతో గడపడం వల్ల చెప్పలేనంత ఆనందాన్ని పొందింది. ఈ మొత్తం ఉదంతాన్ని సోషల్ మీడియాలో షేర్ చేయడంతో వైరల్‌గా మారింది. ఫ్యాన్స్ అంటే కేవలం థియేటర్లో ఈలలు వేసేవారే కాదు, ఇలాంటి చిన్న పిల్లల మనసులో కూడా తమకు చోటు ఉందని విజయ్ నిరూపించారు.



## ధురంధర్ 2పై ప్రశంసలు.. డౌట్ కొడుతోంది: ప్రకాశ్ రాజ్

విలక్షణ నటుడు ప్రకాశ్ రాజ్ మరోసారి తన వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచారు. ఇటీవల విడుదలైన బాలీవుడ్ చిత్రం 'ధురంధర్ ది రివెంజ్'ను దక్షిణాది స్టార్ హీరోలు ప్రశంసించడంపై ఆయన పరోక్షంగా అనుమానం వ్యక్తం చేశారు. ఈ ప్రశంసల వెనుక ఉన్నది నిజమైన అభిమానమేనా, లేక ఇతర 'బాధ్యతలు' కూడా ఉన్నాయా? అనే అర్థం వచ్చేలా ఆయన కామెంట్ చేశారు. వివరాల్లోకి వెళితే... రణ్‌వీర్ సింగ్ హీరోగా ఆదిత్య ధర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ స్పై థ్రిల్లర్ నిన్న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన విషయం తెలిసిందే. సినిమాకు మంచి స్పందన వచ్చింది. ఈ క్రమంలో అల్లు అర్జున్, మహేశ్ బాబు, జూనియర్ ఎన్టీఆర్, విజయ్ దేవరకొండ వంటి పలువురు దక్షిణాది అగ్ర తారలు సోషల్ మీడియా వేదికగా ప్రశంసలు కురిపించారు. ఈ నేపథ్యంలో ఓ సోషల్ మీడియా యూజర్.. 'నలుగురు పెద్ద సౌత్ స్టార్లు ధురంధర్‌ను పొగిడారు. ఒక్క బాలీవుడ్ సెలబ్రిటీ అయినా ఈ సినిమా గురించి మాట్లాడారా?" అని ప్రశ్నిస్తూ ఒక పోస్ట్ పెట్టారు. ఈ పోస్టుపై స్పందించిన ప్రకాశ్ రాజ్..



## ధురంధర్ 2: పాక్‌లో పైరసీ డౌన్‌లోడ్స్

భారతీయ చలనచిత్ర పరిశ్రమను పట్టిపీడిస్తున్న పైరసీ భూతం ఇప్పుడు ప్రతిష్ఠాత్మక చిత్రం -దురంధర్ 2-ను కూడా వదలడం లేదు. మార్చి 19న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదలైన కొన్ని గంటల్లోనే ఈ సినిమా పైరేటెడ్ వెర్షన్ పాకిస్తాన్‌లో ప్రత్యక్షం కావడం సంచలనం సృష్టిస్తోంది. గతంలో -దురంధర్- మొదటి భాగం పాకిస్తాన్‌లో అత్యధికంగా పైరసీలో డౌన్ లోడ్ చేయబడిన చిత్రంగా రికార్డు సృష్టించగా, ఇప్పుడు దాని సీక్వెల్ కూడా అదే బాటలో పయనిస్తోంది. పాక్ యువత థియేటర్లకు వెళ్లే అవకాశం లేకపోయినా.. ఇంటర్నెట్ వేదికగా ఈ సినిమాను చూసేందుకు ఎగబడుతున్నారు. లాహోర్‌కు చెందిన ఖలీద్ మహమ్మద్ అనే జర్నలిస్ట్ తన ఇంట్లోనే -దురంధర్ 2- పైరేటెడ్ వెర్షన్ చూస్తున్న ఫోటోలను ఎక్స్ (ట్విట్టర్)లో షేర్ చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. దీనిపై చిత్ర యూనిట్ రీసెర్చ్ కన్సల్టెంట్ ఆదిత్య రాజ్ కౌల్ స్పందిస్తూ.. -పాకిస్తానీ టెర్రరిస్టులను నలిపేస్తున్న ఇండియన్ సినిమాను చూడకుండా పాకిస్తానీయులు ఉండలేకపోతున్నారు- అంటూ వ్యాఖ్యానించారు. సినిమాలోని ట్విస్టులు, ఉత్కంఠను థియేటర్లలోనే అనుభవించాలని దర్శకుడు ఆదిత్య ధర్ ఎంత వేడుకున్నా.. సరిహద్దుల అవతల పైరసీ ఆగడం లేదు.



## నోరా ఫతేహీపై ఫత్వా జారీ

కన్నడ చిత్రం 'కేడీ: ద డెవిల్'లోని 'సర్కే చునార్ తేరి సర్కే' అనే ప్రత్యేక గీతం దేశవ్యాప్తంగా తీవ్ర వివాదానికి దారితీసింది. ఈ పాటలో నటించిన బాలీవుడ్ నటి నోరా ఫతేహీపై అలీగఢ్‌కు చెందిన 'దారుల్ ఇఫ్తా' అనే ముస్లిం మతపరమైన సంస్థ ఫత్వా జారీ చేసింది. మరోవైపు వెల్లువెత్తుతున్న నిరసనల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ పాటపై నిషేధం విధిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ లోక్‌సభలో ధ్రువీకరించారు. అయితే, పాటలోని సాహిత్యం ఇస్లామిక్ బోధనలకు విరుద్ధంగా ఉందని, ఇటువంటి ప్రదర్శనలు సమాజంలోకి తప్పుడు సందేశాన్ని పంపుతాయని దారుల్ ఇఫ్తా సంస్థ తన ఫత్వాలో పేర్కొంది. ముఖ్యంగా ముస్లిం యువతను ఈ పాట తప్పుదోవ పట్టించేలా ఉందని ఆక్షేపించింది. ఈ నేపథ్యంలోనే నోరా ఫతేహీపై ఫత్వా జారీ చేస్తున్నట్లు ప్రకటించింది.



## మణిరత్నం సినిమాలో సాయి పల్లవి!

సినీ లవర్స్, మణిరత్నం అభిమానులు అత్యంత ఆసక్తిగా ఎదురు చూస్తున్న సినిమా ప్రాజెక్ట్‌ని తాజాగా అఫీషియల్‌గా ప్రకటించారు. భారీ స్థాయిలో తెరపైకి రానున్న ఈ మూవీని కోలీవుడ్‌లో ప్రముఖ నిర్మాణ సంస్థగా పేరు తెచ్చుకున్న లైకా ప్రొడక్షన్స్ సంస్థ అత్యంత ప్రతిష్టాత్మంగా తెరపైకి తీసుకురాబోతోంది. మద్రాస్ టాకీస్ సహ భాగస్వామిగా వ్యహరిస్తోంది. ఈ బ్యానర్ కిది 23వ సినిమా. విలక్షణ నటనకు పెట్టింది పేరు విజయ్ సేతుపతి. ఇందులో కథానాయకుడిగా నటిస్తున్నారు. మణిరత్నంతో ఆయనకిది రెండవ సినిమా. ఇంతకు ముందు -చెక్క చివంత వానం-లో నటించారు. దీన్నే తెలుగులో -నవాబ్- పేరుతో డబ్బింగ్ చేసి రిలీజ్ చేసిన విషయం తెలిసిందే. ఈ మూవీ తరువాత మళ్లీ వీరిద్దరు కలిసి చేస్తున్న సినిమా ఇది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌లో కథానాయికగా సాయి పల్లవి నటిస్తోంది. -రామాయణ-తో పాటు పలు భారీ ప్రాజెక్ట్‌లలో నటిస్తూ బిజీగా ఉన్న సాయి పల్లవికి మణిరత్నంతో ఇది మొదటి సినిమా కావడం గమనార్హం. ఏ. ఆర్. రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. కొన్ని రోజులుగా రెహమాన్ స్థానంలో యంగ్ సెన్సేషన్ సాయి అభ్యంకర్ ని మ్యూజిక్ డైరెక్టర్‌గా తీసుకుంటారని ప్రచారం జరిగింది.



## హ్యాపీ రాజ్‌తో అబ్బాస్ రీఎంట్రీ

90స్ లో తన స్టైల్ అండ్ స్మైల్ తో ప్రేక్షకులను అలరించిన లవర్ బాయ్ అబ్బాస్ మళ్లీ సిల్వర్ స్క్రీన్ పై సందడి చేయనున్నారు. సుమారు 11 ఏళ్ల బ్రేక్ తర్వాత ఆయన హ్యాపీ రాజ్ సినిమాతో రీఎంట్రీ ఇస్తుండటం సినీ అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. మ్యూజిక్ డైరెక్టర్, నటుడు జీవీ ప్రకాష్ కుమార్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి రాజా దర్శకత్వం వహిస్తున్నారు. తెలుగు బ్యూటీ శ్రీ గౌరీ ప్రియ హీరోయిన్ గా కనిపించనున్నారు. బియాండ్ పిక్చర్స్ బ్యానర్ పై సినిమాను జైవర్ధ నిర్మిస్తుండగా.. ఇప్పటికే షూటింగ్ పూర్తి అయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుపుకుంటున్న ఆ చిత్రం మార్చి 27న ప్రేక్షకుల ముందుకు రానుంది.



## డెకాయిట్‌లో మృణాల్ డబ్బింగ్ షురూ


అడివి శేష్, మృణాల్ ఠాకూర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'డెకాయిట్' షూటింగ్ పూర్తి చేసుకుని ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో నిమగ్నమై ఉంది. తాజాగా ఈ సినిమా గురించి హీరోయిన్ మృణాల్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక క్రేజీ అప్‌డేట్ ఇచ్చింది. ఈ సినిమా కోసం ఆమె డబ్బింగ్ పనులను మొదలుపెట్టినట్లు తెలుపుతూ స్టూడియో నుండి ఒక ఫోటోను షేర్ చేసింది. దర్శకుడు షనీల్ డియో ఈ చిత్రాన్ని ఒక రొమాంటిక్ రివెంజ్ క్రైమ్ థ్రిల్లర్‌గా వెండితెరపై ఆవిష్కరిస్తున్నాడు. కేవలం యాక్షన్ మాత్రమే కాకుండా, బలమైన భావోద్వేగాలతో ఈ కథ సాగనుంది. ఇందులో బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్ మరియు సీనియర్ నటుడు ప్రకాష్ రాజ్ ముఖ్య పాత్రల్లో నటిస్తుండటం విశేషం. భీమ్స్ సిసిరోలియో ఈ చిత్రానికి బాణీలు అందిస్తున్నాడు. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తున్న ఈ భారీ బడ్జెట్ చిత్రం ఏప్రిల్ 10, 2026న ప్రపంచవ్యాప్తంగా పలు భాషల్లో విడుదల కానుంది. విడుదల తేదీ దగ్గరపడుతుండటంతో చిత్ర యూనిట్ పనుల వేగాన్ని పెంచింది. అడివి శేష్, మృణాల్ కలయికలో వస్తున్న మొదటి సినిమా కావడంతో సినీ ప్రియుల్లో ఈ ప్రాజెక్ట్ పై మంచి ఆసక్తి నెలకొంది.

# ట్రోఫీ మీదే నా కన్ను



గతేడాది ట్రోఫీకి అడుగు దూరంలో ఆగిపోయిన పంజాబ్ కింగ్స్ ఈసారి టైటిల్‌పై కన్నేసింది. ఈ విషయాన్ని కొత్త జెర్సీ విడుదల సందర్భంగా కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ తెలిపాడు. 'మాపై అంచనాలు భారీగానే ఉన్నాయి. నాకు సవాళ్లంటే ఇష్టం. అన్నింటికంటే ముఖ్యమైన విషయం.. మేము మైదానంలోకి దిగిన ప్రతిసారి గెలవాలనుకుంటాం. ఈసారి నా కన్ను ట్రోఫీపైనే ఉంది' అని అయ్యర్ పేర్కొన్నాడు. ఫ్రాంచైజీ యాజమాన్యం,పేసర్ అర్ష్‌దీప్ సింగ్‌తో కలిసి అయ్యర్ కొత్త జెర్సీని ఆవిష్కరించాడు. నిరుడు ఉత్కంఠగా సాగిన ఫైనల్లో 6 పరుగుల తేడాతో ఆర్సీబీ చేతిలో ఓడిన పంజాబ్ రన్నరప్‌తో సరిపెట్టుకుంది.

# ఐపీఎల్‌కు మూడో ర్యాంకు



**సంపదపరంగా ప్రపంచంలోనే అత్యంత విలువైన టీ20 లీగ్ ఐపీఎల్. అలాంటి లీగ్‌కు వరల్డ్ క్రికెటర్స్ అసోసియేషన్ (డబ్ల్యూసీఏ) మూడో ర్యాంకు ఇవ్వడం గమనార్హం. దీనిపైనే సోషల్ మీడియాలో తీవ్ర స్థాయిలో విమర్శలు వస్తున్నాయి.**

ఐపీఎల్‌లో అందుకొనే పారితోషికంలో కనీసం ఐదోవంతు కూడా ఉండని ది హండ్రెడ్ లీగ్‌కు అగ్రస్థానం ఇచ్చింది. ఇటీవల ముగిసిన ది హండ్రెడ్ లీగ్ వేలంలో అత్యధిక ధరను సొంతం చేసుకొన్న క్రికెటర్‌కు దక్కిన మొత్తం రూ.4.81 కోట్లు. అదే ఐపీఎల్‌లో అయితే రూ.25 కోట్ల పైమాటే. కామెరూన్ గ్రీన్‌ను కోల్‌కతా నైట్‌రైడర్స్ రూ.25.20 కోట్లు వెచ్చించి మరీ సొంతం చేసుకుంది. దక్షిణాఫ్రికా వేదికగా జరిగే ఎస్‌ఏ20 లీగ్‌కూ ర్యాంకింగ్స్‌లో రెండో స్థానం దక్కింది. ఇక్కడా టాప్ ప్లేయర్‌కు వచ్చిన మొత్తం కేవలం రూ. 8.3 కోట్లే. అంటే ఐపీఎల్‌లో దేశవాళీ క్రికెటర్ దక్కించుకున్న రూ.12.40 కోట్ల కంటే చాలా తక్కువే. ఇలాంటి లీగ్‌కు మూడో స్థానం ఇవ్వడమేంటని అభిమానుల నుంచి కామెంట్లు వస్తున్నాయి. ఆటగాళ్లకు ఇచ్చే మొత్తం, చెల్లింపుల వ్యవహారంలో ఐపీఎల్‌కు పూర్తి మార్కులు పడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ఐపీఎల్‌కు ఉన్న ఆర్థికబలం మరే జట్టుకు లేదని డబ్ల్యూసీఏ పేర్కొంది. అయితే, ఆటగాళ్ల హక్కుల రక్షణకు సంబంధించి ఐపీఎల్‌కు తక్కువ మార్కులు వచ్చాయి. ఈ విషయంలో ఇంకాస్త మెరుగుకావాల్సిన అవసరం ఉందని తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ విస్తరణకు లీగ్‌ల కృషి మరువలేనిదని డబ్ల్యూసీఏ చీఫ్ ఎగ్జిక్యూటివ్ టామ్ మోఫాట్ తెలిపారు. ఇప్పుడీ ర్యాంకుల ఉద్దేశం ఆయా లీగ్‌లను తక్కువ చేయడం కాదని.. మరింత విజయవంతంగా మారేందుకు అవసరమైన సాయం అందించడమే లక్ష్యమని స్పష్టం చేశారు.

**మార్కులు ఇలా..**

| | |
|---|---|
| ది హండ్రెడ్ | 75.2 |
| ఎస్‌ఏ20 | 68.0 |
| ఐపీఎల్ | 62.6 |
| బిగ్‌బాష్ లీగ్ | 62.5 |
| పీఎస్‌ఎల్ | 48.0 |
| మేజర్ లీగ్ క్రికెట్ | 43.0 |
| ఐఎల్‌టీ20 | 39.1 |
| సీపీఎల్ | 38.9 |
| అబుదాబి టీ10 | 30.1 |
| బీపీఎల్ | 22.6 |

## 20 మందితో ప్రపంచకప్ 2027 ప్రాబబుల్స్

బీసీసీఐ వన్డే ప్రపంచకప్ 2027 కోసం ఇప్పటికే ఓ 20 మందితో కూడిన ప్రాబబుల్స్ లిస్ట్‌ను రెడీ చేసినట్లు సమాచారం. ఇదంతా వచ్చే ఏడాది వన్డే ప్రపంచ కప్ కోసమేనని క్రికెట్ వర్గాలు తెలిపాయి. ఐపీఎల్ మ్యాచుల్లోనూ సదరు ప్లేయర్ల ఆటతీరును సెలక్టర్లు దగ్గరుండి గమనిస్తారు. 'ప్రతి సెలక్టర్ కచ్చితంగా వారానికి ఒక్క మ్యాచ్ అయినా మైదానానికి వెళ్లి చూడాలి. ఇలా అందరూ కలిసి వారానికి ఐదు మ్యాచులను కవర్ చేసినట్లు అవుతుంది. ఐపీఎల్‌లో మ్యాచులను గమనించడమంటే రాబోయే లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్, టీ20 ప్రపంచ కప్ 2028ను దృష్టిలో ఉంచుకుని మాత్రం కాదు. అలాగని, వన్డే ప్రపంచ కప్ కోసం కొత్తగా స్టార్‌ను వెతికే పనీ లేదు. ఉన్న ప్లేయర్ల ఆటతీరుపై అంచనా వేయాలి. హర్షిత్ రాణా గాయం కారణంగా ఇప్పటికే టోర్నీ నుంచి వైదొలిగాడు. మిగిలిన పేసర్లు జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, అర్ష్‌దీప్ సింగ్, హార్దిక్ పాండ్య ఆటతీరును సెలక్టర్లు ట్రాక్ చేస్తారు' అని బీసీసీఐ వర్గాలు తెలిపాయి. ఐపీఎల్ ముగిసిన తర్వాత అఫ్గానిస్థాన్‌తో భారత్ ఒకే ఒక్క టెస్టు మ్యాచ్ ఆడనుంది. ఇదేమీ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో భాగం కానప్పటికీ.. టీమ్‌ఇండియాలో ప్రతి సీనియర్ ఆటగాడు బరిలోకి దిగుతాడని బీసీసీఐ పేర్కొంది.

## నెట్స్‌లో ధోనీకి గాయం

ఐపీఎల్ 2026 సీజన్ కోసం చెన్నై సూపర్ కింగ్స్(సీఎస్‌కే) తమ సన్నాహకాలను మొదలుపెట్టింది. మిగతా ఫ్రాంచైజీల కన్నా ముందే తమ హోమ్ గ్రౌండ్ చెపాక్‌లో ప్రాక్టీస్ క్యాంప్ ప్రారంభించింది. మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీతో పాటు ఆటగాళ్లంతా అప్‌కమింగ్ సీజన్ కోసం కఠోర శిక్షణ తీసుకుంటున్నారు. గంటల కొద్దీ బ్యాటింగ్, బౌలింగ్ సెషన్స్‌తో పాటు ఇంట్రా స్క్వాడ్ మ్యాచ్‌లు ఆడుతూ సన్నదమవుతున్నారు. 45 ఏళ్ల వయసులోనూ ధోనీ తన ఆటను కొనసాగిస్తున్నాడు. ఏమైందో ఏమో కానీ ధోనీ కుంటుతూ నడుస్తున్న ఒక వీడియో నెట్టింట హాట్‌టాపిక్‌గా మారింది. నెట్‌సెషన్ పూర్తి చేసుకొని మైదానం వీడే క్రమంలో ధోనీ మోకాలి నొప్పితో బాధపడుతూ కుంటుతూ కనిపించాడు. కాస్త కష్టంగానే మైదానం వీడాడు.

# ఐపీఎల్‌కు స్టార్క్ దూరం!



ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి ముందే ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు స్టార్ పేసర్, ఆస్ట్రేలియా క్రికెటర్ మిచెల్ స్టార్క్.. ఆరంభ మ్యాచ్‌లకు దూరం కానున్నాడు. వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా స్టార్క్ విషయంలో క్రికెట్ ఆస్ట్రేలియా కఠిన వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. దాంతో గాయాలతో ఇబ్బంది పడుతున్న ప్యాట్ కమిన్స్, జోష్ హజెల్ వుడ్ తరహాలోనే ఐపీఎల్ 2026 ఆరంభ మ్యాచ్‌లకు కమిన్స్ దూరంగా ఉండనున్నాడు. గతేడాదిగా మిచెల్ స్టార్క్‌పై తీవ్ర పనిభారం పడిందని క్రికెట్ ఆస్ట్రేలియా వర్గాలు తెలిపాయి. ఇంగ్లండ్‌తో ఐదు టెస్ట్‌ల యాషెస్ సిరీస్‌లో అన్ని మ్యాచ్‌లు ఆడాడు. బిగ్‌బాష్ లీగ్‌లోనూ అద్భుత బౌలింగ్‌తో మెరిశాడు. టెస్ట్‌ల్లో అత్యధిక బంతులు విసిరిన బౌలర్ల జాబితాలో ముందున్నాడు. టీ20ల్లో వేసేది నాలుగు ఓవర్లే అయినా.. ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది. కొత్త బంతితో అద్భుతాలు చేసే స్టార్క్‌పై వర్క్‌లోడ్ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఆసీస్ మేనేజ్‌మెంట్ భావిస్తోంది. అందుకే రాబోయే రోజుల్లో రిటర్న్ టు ప్లే ప్రొటోకాల్స్‌ను అనుసరించి క్రికెట్ ఆస్ట్రేలియా అనుమతి ఇవ్వనుంది. దాంతో తొలి వారంలో మ్యాచ్‌లకు అతను దూరమయ్యే అవకాశాలే అధికంగా ఉన్నాయని క్రికెటర్ వర్గాలు పేర్కొన్నాయి. అంతర్జాతీయ టీ20లకు గతేడాది వీడ్కోలు పలికిన స్టార్క్.. టెస్ట్‌లు, వన్డేల్లో మాత్రమే కొనసాగుతున్నాడు. ఫ్రాంచైజీ క్రికెట్ ఆడుతున్నాడు. మిచెట్ స్టార్క్‌ను ఢిల్లీ క్యాపిటల్స్ రూ.11.75 కోట్లకు సొంతం చేసుకుంది. ఆసీస్ ప్లేయర్లలో కమిన్స్, హేజిల్‌వుడ్ సైతం ఆరంభ ఐపీఎల్ మ్యాచ్‌లకు దూరం అవ్వగా.. ఎల్లిస్ ఈ సీజన్ మొత్తానికే దూరమయ్యాడు.

## మూడో టీ20లో దక్షిణాఫ్రికాపై కివీస్ గెలుపు




దక్షిణాఫ్రికాతో జరిగిన మూడో టీ20 మ్యాచ్‌లో న్యూజిలాండ్ 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఆక్లాండ్‌లో జరిగిన మ్యాచ్‌లో ఫస్ట్ బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి కేవలం 136 రన్స్ మాత్రమే చేసింది. ఆ తర్వాత స్వల్ప టార్గెట్‌తో బరిలోకి దిగిన కివీస్ కేవలం 16.2 ఓవర్లలో టార్గెట్‌ను అందుకున్నది. కివీస్ ఓపెనర్ టామ్ లాథమ్ కీలక ఇన్నింగ్స్ ఆడాడు. అతను 63 రన్స్ చేశాడు. తొలి వికెట్‌కు డేవాన్ కాన్వేతో కలిసి 96 పరుగులు జోడించారు. కాన్వే 39 పరుగులు చేయగా, లాథమ్ టీ20ల్లో నాలుగవ హాఫ్ సెంచరీ నమోదు చేశాడు. మరో 22 బంతులు మిగిలి ఉండగానే కివీస్ విజయాన్ని అందుకున్నది. దీంతో అయిదు మ్యాచ్‌ల సిరీస్‌లో కివీస్ 2-1 తేడాతో ఆధిక్యాన్ని సాధించింది. కివీస్ బౌలర్ లాకీ ఫెర్గూసన్ అత్యద్భుతంగా బౌలింగ్ చేశాడు.

# టెన్నిస్ కష్టంగా అనిపిస్తోంది



మహిళల టెన్నిస్‌లో మరో సంచలనం. ఒకప్పుడు వరల్డ్ నంబర్ 1 ఇగా స్వియాటెక్ మియామి ఓపెన్ తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టింది. శుక్రవారం జరిగిన ఓపెనింగ్ మ్యాచ్‌లో ఈ టాప్ సీడ్ అనూహ్యంగా ఓటమి పాలైంది. రెండు గంటల 10 నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో పోలె మగ్ద లినెట్టే చేతిలో స్వియాటెక్ చిత్తైంది. ఫేవరెట్‌గా ఇంటర్ మియామి ఓపెన్‌లో బరిలోకి దిగిన ఇగా స్వియాటెక్‌కు భారీ షాక్ తగిలింది. తొలి రౌండ్‌లోనే ఘోర పరాజయం చవిచూసిందీ మూడో ర్యాంకర్. 50వ ర్యాంకర్ పోలె మగ్ద లినెట్టే తొలి సెట్ నుంచి జోరు చూపించి 6-1, 5-7, 6-3తో స్వియాటెక్‌కు చెక్ పెట్టింది. దాంతో, డబ్ల్యూటీఏ టూర్‌లో తొలి రౌండ్‌లో 73 విజయాల రికార్డుకు బ్రేకు వేసింది. ఊహించని పరాజయం అనంతరం మాట్లాడుతూ.. 'నేను ఓడిపోయానంటే నమ్మబుద్ధి కావడం లేదు. రాను రాను టెన్నిస్ ఆట కష్టంగా అనిపిస్తోంది . ఈ ఆట చాలా తేలిక అనుకున్నా. కానీ, కోర్టులో మానసికంగా మనం ఎలా ఉంటామనేది చాలా కీలకం. ఇది నాకొక చెత్త మ్యాచ్. ఈ ఓటమి నుంచి పాఠాలు నేర్చుకుంటా. మళ్లీ నా పనిలో మునిగిపోతా. ప్రాక్టీస్ చేస్తాను. పాజిటివ్‌గా ఆలోచిస్తూ.. నా ఆటను మెరుగుపరచుకుంటా' అని స్వియాటెక్ చెప్పింది.

# నల్లగా ఉన్నానని పక్కనబెట్టారు: శివరామకృష్ణన్

భారత మాజీ క్రికెటర్ లక్ష్మణ్ శివరామకృష్ణన్ కామెంటేటర్ కెరీర్‌ను ముగించాడు. దాదాపు ఇరవై ఏళ్లకు పైగా తన స్టయిల్ క్రికెట్ కామెంటరీతో అలరించిన ఆయన అనూహ్యంగా రిటైర్మెంట్ ప్రకటించాడు. జాత్యహంకారం కారణంగానే తాను కామెంటరీ రంగం నుంచి వైదొలుగుతున్నట్టు మాజీ లెగ్ స్పిన్నర్ వెల్లడించాడు. తాను ఈ నిర్ణయం తీసుకోవడానికి దారి తీసిన పరిస్థితులను ఆయన ఎక్స్ పోస్ట్‌ల రూపంలో పంచుకున్నాడు. ప్రపంచ క్రికెట్‌లో జాతి వివక్ష గురించి విన్నాం. కామెంటేటరీ ఫీల్డ్‌లోనూ వివక్ష ఉందంటున్నాడు భారత మాజీ ఆటగాడు లక్ష్మణ్ శివరామకృష్ణన్. సుదీర్ఘకాలం కామెంటేటర్‌గా కొనసాగిన ఆయన .. నాపై వివక్ష చూపించారు. అందుకే తాను బీసీసీఐ కామెంటేటర్‌గా వైదొలుగుతున్నా అని ఎక్స్ పోస్ట్‌లో తన ఆవేదనను వెల్లడించారు. 'టాస్ విధులు, మ్యాచ్ అనంతరం ప్రజంటేషన్ వంటి ముఖ్యమైన కార్యక్రమాలకు నన్ను తీసుకునేవారు కాదు. ఇరవై ఏళ్ల అనుభవం ఉన్నా కూడా నన్ను పరిగణించకపోవడం బాధించేది' అని ఆయన తెలపాడు. అందుకు 'బహుశా మీరు నల్లగా ఉండడం ఒక కారణం కావచ్చు' అని ఒక యూజర్ అనగా.. 'అవును మీరు చెప్పింది నిజం. వర్ణ వివక్షకు గురయ్యాను' అని ఆయన బదులిచ్చాడు. 'నేను వీడ్కోలు పలకడం పెద్ద విషయం కాదు. కానీ, ప్రొడక్షన్, బాధ్యతల కేటాయింపులో వివక్ష వెలుగులోకి రావడం చాలా ముఖ్యం. త్వరలోనే మీకు పూర్తిగా నిజానిజాలు తెలుస్తాయి' అని 60 ఏళ్ల శివరామకృష్ణన్ పేర్కొన్నాడు. 1980ల్లో లెగ్ స్పిన్నర్‌గా భారత విజయాల్లో కీలకమైన శివరామకృష్ణన్ 9 టెస్టులు, 16 వన్డేలు ఆడాడు. టెస్టుల్లో 26, వన్డేల్లో 15 వికెట్లు పడగొట్టాడు.



# ఎస్‌ఆర్‌హెచ్‌కు మరో షాక్!

### గాయంతో జాక్ ఎడ్వర్డ్స్ దూరం



మూలిగే నక్క మీద తాటి పండు పడ్డట్టు ఉంది సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ పరిస్థితి. ఇప్పటికే కెప్టెన్ ప్యాట్ కమిన్స్ గాయంతో ఆరంభ మ్యాచ్‌లకు దూరం కావడంతో ఇషాన్ కిషన్‌ను తాత్కలిక సారథిగా ప్రకటించారు. తాజాగా సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆల్‌రౌండర్ జాక్ ఎడ్వర్డ్స్ గాయంతో ఈ సీజన్ మొత్తానికి దూరమైనట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని ప్రముఖ క్రికెట్ వెబ్‌సైట్ క్రిక్‌బజ్ పేర్కొంది. జాక్ ఎడ్వర్డ్స్ తొడ కండరాల గాయంతో ఇబ్బంది పడుతున్నాడని తెలిపింది. ఆస్ట్రేలియా దేశవాళీ క్రికెట్ టోర్నీ షెఫీల్డ్ షీల్డ్‌లో జాక్ ఎడ్వర్డ్స్ గాయపడినట్లు తెలుస్తోంది. ఆస్ట్రేలియాకు చెందిన జాక్ ఎడ్వర్డ్స్‌ను ఐపీఎల్ 2026 వేలంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ రూ. 3 కోట్లకు కొనుగోలు చేసింది. ప్యాట్ కమిన్స్ గైర్హాజరీలో అతను లేని లోటును జాక్ ఎడ్వర్డ్స్ తీర్చుతాడని అంతా అనుకున్నారు. కానీ అతను కూడా గాయపడటంతో సన్‌రైజర్స్ హైదరాబాద్ బౌలింగ్ పూర్తిగా బలహీనంగా మారింది. అయితే జాక్ ఎడ్వర్డ్స్ గాయంపై సన్‌రైజర్స్ హైదరాబాద్ ఎలాంటి ప్రకటన చేయలేదు. ఒకవేళ అతను సీజన్ మొత్తం దూరమైతే.. మరో ఆటగాడిని రిప్లేస్ చేసే అవకాశం ఉంది.

ఈవార్తలు
# ప్రజావాణి
www.evarthalu.com
నేటి ఈవార్తలు
శనివారం 21-3-2026, జగిత్యాల



## ఫుడ్ యాప్స్ చార్జీల మోత

**ఒకప్పుడు** హోటల్‌కు వెళ్లి తినడం ఒక విలాసం. కానీ, నేడు స్మార్ట్‌ఫోన్ పుణ్యమా అని అరచేతిలోకి అన్నం వచ్చేస్తోంది. జొమాటో, స్విగ్గీ వంటి ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ యాప్స్ మన జీవనశైలిలో అంతర్భాగమయ్యాయి. అయితే, ఈ 'సౌలభ్యం' వెనుక ఇప్పుడు చార్జీల మోత మోగుతోంది. తాజాగా ఈ సంస్థలు తమ ప్లాట్‌ఫామ్ ఫీజులను భారీగా పెంచడం సామాన్యుడి జేబుకు చిల్లు పెడుతున్నాయి. 2023లో కేవలం రూ.2తో ప్రారంభమైన ఈ ఫీజు, ఇప్పుడు దాదాపు రూ.15కు (జీఎస్టీతో కలిపి మరికొంత అదనంగా) చేరింది. తాజా నివేదికల ప్రకారం, జొమాటో తన ప్లాట్‌ఫామ్ ఫీజును 19.2% పెంచి రూ. 14.90కి చేర్చగా, స్విగ్గీ సైతం అదే స్థాయిలో వసూలు చేస్తోంది. కేవలం ఆహారంపైనే కాకుండా, డెలివరీ చార్జీలపై కూడా 18% జీఎస్టీని వర్తింపజేయాలని ప్రభుత్వం నిర్ణయించడం వినియోగదారులపై అదనపు భారాన్ని మోపింది. ప్లాట్‌ఫామ్ ఫీజుతో పాటు డెలివరీ చార్జీలు, పీక్ అవర్ సర్జ్ చార్జీలు, రెయిన్ ఫీజు వంటివి కలిపి చూస్తే.. హోటల్ మెనూ ధర కంటే యాప్‌లో ఆర్డర్ చేసే ధర చాలా ఎక్కువగా ఉంటోంది. ముడి చమురు ధరల పెరుగుదల, కార్యాచరణ ఖర్చులు పెరగడం వల్ల ఈ పెంపు తప్పనిసరి అని కంపెనీలు వాదిస్తున్నాయి. కానీ, ఈ ధరల పెరుగుదల వల్ల మధ్యతరగతి ప్రజలు ఆన్‌లైన్ ఆర్డర్లకు దూరమయ్యే ప్రమాదం ఉంది. రెస్టారెంట్ యజమానులు సైతం ఈ యాప్స్ వసూలు చేసే కమీషన్ల వల్ల ధరలు పెంచాల్సి వస్తోందని ఆందోళన చెందుతున్నారు. సాంకేతికత అనేది వినియోగదారుడికి మేలు చేయాలి కానీ, వారిని దోచుకునే సాధనంగా మారకూడదు. సౌకర్యం పేరిట అడ్డగోలుగా చార్జీలు పెంచుకుంటూ పోతే, ప్రజలు మళ్లీ పాత పద్ధతులకే (నేరుగా హోటల్‌కు వెళ్లడం లేదా ఫోన్ ద్వారా ఆర్డర్ చేయడం) మొగ్గు చూపే అవకాశం ఉంది. పారదర్శకమైన ధరల విధానం ఉన్నప్పుడే ఈ సంస్థలు దీర్ఘకాలంలో మనగలుగుతాయి. సౌకర్యానికి వెల ఉండొచ్చు, కానీ అది అతిగా ఉండకూడదు.



## కళ అంటే టీకా..!

కళ అంటే..
వ్యాఖ్యాన విశ్లేషణలకు
అందని అమీర్త సౌందర్యం
మనో వికాస సువాసనల పూదోట
మానవీయతకు ఆమని సంగీతం
మానసికదుర్భలత్వాన్ని
తరిమేసే బుద్ధి ఆరోగ్య వ్యాయామం
భావోద్వేగాల జలపాతం
ఆలోచనా సమన్వయ నదీ ప్రవాహం
కళ.అంటే కళే
పర్యాయపదం లేదు
మనసుపొలంలో అభిరుచి విత్తనాలతో
భావాల నటనన పంటను
పండించే రంగస్థలం
ప్రశాంతతకు ఉపాధి
అనుభూతి నాట్యానికి స్థాయీ భావం
మనసుబడి నైపుణ్యాల సంయోగం
పఠనం పాఠనం వ్యాఖ్యానం గానం
ఉపన్యాసం నటన చిత్రలేఖనం
అన్నీ కళలే
జీవితమూ కళే
పుస్తకాన్ని గెంటేసిన ఇల్లు
లయ కూజితాలు చేయని నోరు
గీతాలకు సౌందర్యమివ్వని చేతులు
కార్బన్ దయాక్సైడు కార్ఖానాలు
అప్పుడు మనస్సుయెడారే చవిటి
గీతలకు సౌందర్యం ఇవ్వని చేతులు
కార్బండ యాక్సైడు కార్ఖానాలు
అప్పుడు మనస్సుయెడారే
చవిటినేలే
నీటి జాలు దొరకని ఒయాసిస్
కళ రాబడి బ్యాంకు ఖాతా కాదు
మాట అభినయ పరిమళం
కలను బహిష్కరి స్తే
జీవితం ఉప్పిరిలేనీ శరీరమే
మానవ సంబంధాల్లో బీభత్స రసమే
టీవీ సినిమా.సెల్ ఫోన్లు
కలను మింగేస్తున్న భస్మాసురహస్తాలే
మానవ సంబంధాలు బీటలు
వాస్తు సంబంధాలు భూకంపాలు
అమెరికా కళ దర్శకత్వంలో
కళాత్మకత.కంకాలమే
రాబడి కళ ఎండమావుల సామ్రాజ్యం
మనోభురుచి కళ మానవతామృత
సేవనం
కళ మనిషి జీవన సౌందర్య ప్రపంచం

- జనార్దన వల్లభాపురం
ఫోన్ నంబర్: 9440163687



## ....నేడు ప్రపంచ అటవీ దినోత్సవం....

# ప్రకృతి విధ్వంసం.. ....మానవాళికి వినాశనం

ప్రకృతి ప్రసాదించిన అపురూపమైన సంపద అడవి. మానవ నాగరికతకు ఊపిరిపోస్తూ, భూగోళంపై జీవవైవిధ్యాన్ని కాపాడుతున్న ఈ 'పచ్చని ఊపిరితిత్తులు' నేడు నిప్పుల కొలిమిలో చిక్కుకున్నాయి. దేశవ్యాప్తంగా ప్రతి ఏటా వేసవి కాలంలో సంభవిస్తున్న 'కార్చిచ్చు' కేవలం చెట్లను మాత్రమే కాదు, పర్యావరణ సమతుల్యతను కూడా బూడిద చేస్తోంది. ఇది కేవలం అటవీ శాఖ సమస్య కాదు, దేశ భవిష్యత్తుకు పెను సవాలు.



ముత్యాల సురేశ్
సీనియర్ జర్నలిస్ట్, 99127 15325

భారతదేశ భౌగోళిక విస్తీర్ణంలో సుమారు 24 శాతం పైగా అడవులు ఉన్నాయని గణాంకాలు చెబుతున్నప్పటికీ, నాణ్యమైన అడవుల శాతం క్రమంగా తగ్గుతోంది. అడవులు వాతావరణంలోని కార్బన్ డయాక్సైడ్‌ను గ్రహించి, గ్లోబల్ వార్మింగ్‌ను అరికట్టడంలో అగ్రభాగాన నిలుస్తాయి. నదుల ప్రవాహానికి, భూగర్భ జలాలు పెరగడానికి అడవులే మూలం. అడవి లేని చోట వర్షపాతం క్షీణించడం మనం చూస్తూనే ఉన్నాం.

ప్రతి ఏటా ఫిబ్రవరి నుంచి జూన్ వరకు దేశంలోని వివిధ అరణ్య ప్రాంతాల్లో మంటలు చెలరేగడం ఆందోళన కలిగిస్తోంది. దీనివల్ల అపార నష్టం కలుగుతోంది. మంటల్లో చిక్కుకుని అరుదైన వన్యప్రాణులు, పక్షులు, కీటకాలు అంతరించిపోతున్నాయి. ఇది ఆహార గొలుసును దెబ్బతీస్తోంది. రూ.వేల కోట్ల విలువైన కలప, ఔషధ మొక్కలు బూడిదవుతున్నాయి. గిరిజనుల జీవనోపాధి దెబ్బతింటోంది. కార్చిచ్చు వల్ల వెలువడే నల్లటి పొగ హిమాలయాల వంటి మంచు పర్వతాలపై చేరి, మంచు వేగంగా కరగడానికి కారణమవుతోంది. ఇది భవిష్యత్తులో నదులు ఎండిపోవడానికి దారితీస్తుంది.

అడవులలో కార్చిచ్చును అరికట్టడం అనేది కేవలం అటవీ శాఖ పని మాత్రమే కాదు, అది సామాజిక బాధ్యత. శాటిలైట్ మ్యాపింగ్ ద్వారా మంటలను ప్రారంభ దశలోనే గుర్తించి, తక్షణమే అటవీ సిబ్బందిని అప్రమత్తం చేసే 'రియల్ టైమ్ అలర్ట్' వ్యవస్థను బలోపేతం చేయాలి. అడవుల్లో ఎండుటాకులు పేరుకుపోకుండా చూడటం, మంటలు వ్యాపించకుండా అడవి మధ్యలో ఖాళీ ప్రదేశాలను శాస్త్రీయంగా ఏర్పాటు చేయాలి. అడవి బిడ్డలైన గిరిజనులను, స్థానిక ప్రజలను అటవీ సంరక్షణలో భాగస్వాములను చేయాలి. వారికి తగిన శిక్షణ, పరికరాలు అందించాలి. స్వార్థ ప్రయోజనాల కోసం, నిర్లక్ష్యంగా అడవికి నిప్పు పెట్టే వారిపై కఠినమైన శిక్షలు అమలు చేయాలి. అడవి చల్లగా ఉంటేనే భూమి చల్లగా ఉంటుంది. అభివృద్ధి పేరిట పర్యావరణాన్ని విస్మరించడం అంటే మన పునాదులను మనమే తవ్వుకోవడం వంటిది. కార్చిచ్చును ఆర్పడం అంటే కేవలం మంటలను ఆర్పడం కాదు, రేపటి తరాన్ని కాపాడటం. ప్రకృతిని ప్రేమిద్దాం, అడవులను సంరక్షిద్దాం.

# ఆర్టీసీపై ధీమా తగ్గుతోంది!

తెలంగాణలో ఇటీవల తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సులకు సంబంధించి వరుస ప్రమాదాలు సంభవిస్తుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. సామాన్యుడికి అత్యంత భరోసానిచ్చే రవాణా వ్యవస్థగా పేరున్న ఆర్టీసీలో ఈ తరహా ప్రమాదాలు ప్రయాణికుల్లో భయాందోళనలను నింపుతున్నాయి. ఆర్టీసీ బస్సు ప్రయాణం అంటే ఒకప్పుడు ధీమా. కానీ, మారుతున్న కాలంతో పాటు ఈ ధీమా సడలుతోంది. ఇటీవల రంగారెడ్డి జిల్లా చేవెళ్ల సమీపంలో జరిగిన టిప్పర్–ఆర్టీసీ బస్సు ప్రమాదం లో 19 మంది ప్రాణాలు కోల్పోవడం రాష్ట్ర చరిత్రలోనే అత్యంత విషాదకర ఘటనలలో ఒకటిగా నిలిచింది. ఇది కేవలం ఒక ప్రమాదం కాదు, వ్యవస్థలోని లోపాలకు నిలువుటద్దం. ప్రమాదాల్లో ప్రాణనష్టం పెరగడానికి ప్రధాన కారణం బస్సుల్లో సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం. చేవెళ్ల ప్రమాద సమయంలో 51 సీట్ల సామర్థ్యం ఉన్న బస్సులో సుమారు 70 మంది ప్రయాణికులు ఉండటం గమనార్హం. కేవలం రద్దీ సమయాల్లోనే కాకుండా, సాధారణ సమయాల్లోనూ అదనపు ప్రయాణికులను అనుమతించడం వల్ల అత్యవసర పరిస్థితుల్లో బస్సును నియంత్రించడం డ్రైవర్లకు



కష్టతరమవుతోంది. చేవెళ్ల దుర్ఘటన జరిగిన మరుసటి రోజే కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ వద్ద ట్రాక్టర్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టి 27 మంది గాయపడ్డారు. అలాగే ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరులో బస్సు అదుపుతప్పి వాగులో పడిపోవడం, జనగామలో లారీని వెనుక నుంచి ఢీకొట్టడం వంటి ఘటనలు డ్రైవర్ల అజాగ్రత్తను లేదా వాహనాల ఫిట్‌నెస్ సమస్యలను ఎత్తిచూపుతున్నాయి. కొన్ని సందర్భాల్లో బ్రేకులు ఫెయిల్ కావడం వంటి సాంకేతిక లోపాలు కూడా ప్రాణాంతకంగా మారుతున్నాయి. ఆర్టీసీ ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులు బస్సుల నిర్వహణపై ప్రభావం చూపుతున్నాయి. పాతబడిన బస్సులను మార్చకపోవడం, టైర్ల నాణ్యతను పట్టించుకోకపోవడం ప్రయాణికుల పాలిట శాపంగా మారుతోంది. ప్రైవేట్ ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణలో తలెత్తుతున్న సమస్యలు కూడా సంస్థ మనుగడకే ప్రమాదకరంగా మారుతున్నాయని కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ప్రతి బస్సుకు నిర్ణీత కాలవ్యవధిలో సాంకేతిక తనిఖీలు తప్పనిసరి చేయాలి. మితిమీరిన వేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌ను అరికట్టేలా డ్రైవర్లకు నిరంతర అవగాహన సదస్సులు నిర్వహించాలి. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోకుండా నిబంధనలను కఠినతరం చేయాలి. ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న 'బ్లాక్ స్పాట్స్' గుర్తించి, అక్కడ రోడ్ల మరమ్మతులు లేదా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. ప్రభుత్వం కేవలం పరిహారాలు ప్రకటించి చేతులు దులుపుకోకుండా, ఆర్టీసీ ప్రయాణం మళ్లీ సురక్షితం కావడానికి శాశ్వత చర్యలు చేపట్టాలి. ప్రయాణికుల ప్రాణాలకు వెలకట్టలేమని గుర్తించినప్పుడే ఇలాంటి విషాదాలకు అడ్డుకట్ట పడుతుంది.

- అమీనా బేగం, న్యాయవాది



## బతకనిద్దాం

లోకంలో
ఏ జీవి సైతం
తనంత తానుగా
కోరుకోదు మరణం..

బలహీన క్షణాలకు
లొంగిన
ఒక్క మనిషి తప్పు..!!

పులి పంజాకు
చిక్కరాదనే
పట్టుదలే పట్టుకొమ్మగా
శక్తికి మించిన వేగంతో
పరుగు తీసే క్రమంలో..

ఓడిపోతుందేమో
కానీ..
జింక లొంగిపోదు...!!

రణభూమికి
రావటానికి ముందే
విల్లును విసర్జించిన
అర్జునుడు
సందిగ్ధత వలయాన్ని దాటి..

విజేతగా నిలిపినది
శ్రీకృష్ణుడి గీతోపదేశం..!!

చదువుకి పనికిరాడని
బడి నుంచి పంపించినా
విద్యుత్ బల్బుని కనుక్కొని
విశ్వానికి వెలుగులు పంచాడు..

వైజ్ఞానిక ఆవిష్కరణల
కొలమానం
ఎడిసన్ గారి తల్లి ప్రోత్సాహం..!!

పరీక్షలో ఫెయిలైన
విద్యార్థులకు ...
తల్లిదండ్రుల
కాసింత ఆసరా
గెలుపు దారికి
మలుపుగా మారదా!?

ప్రేమలో మోసపోయిన
యువతరానికి
స్నేహితుల భరోసా
బ్రతకాలనే ఆశను
చిగురింప చేయదా!?

శ్రమ
నిష్ఫలమైన సమయం
బ్రతుకు
నిష్ఠురమైన గమనం..

కాసింత ప్రేరణ
అందిద్దాం
బతుకుదాం బతకనిద్దాం..!!

- నలిగల రాధికా రత్న

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.